పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎవరో?



- నేడు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 24 గంటల తర్వాతే ఫలితం వెలువడే అవకాశం
- గుంటూరు ఏసీ కళాశాలలో పకడ్బందీగా ఈసీ ఏర్పాట్లు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి మరికొన్ని గంటల్లో నూతన సభ్యుడెవరో తేలిపోనుంది. గత నెల 27న పోలింగ్ జరగ్గా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి గుంటూరు లోని ఏసీ కళాశాలలో ప్రారంభం కానుంది. బ్యాలెట్, ప్రాధాన్య ఓట్ల విధానంతో ఓట్ల లెక్కింపు జరగనుంది. భారీగా పోలింగ్ నమోదైన దృష్ట్యా తుది ఫలితం వెలువడ టానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నది. దీంతో ప్రధాన అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో రాజకీయంగా అంతగా పలుకుబడి లేని నాయకులే టీడీపీ తరపున బరిలోకి దిగారు. ఈ దఫా అందుకు భిన్నంగా దశాబ్ధాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉండి టీడీపీలో ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని పోటీకి దింపింది. దీంతో పార్టీ శ్రేణులతో జనసేన, బీజేపీ నేతలు ఆలపాటి గెలుపు కోసం కృషి చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ మొదలు పోలింగ్ ముగిసేంత వరకు శ్రమించాయి. మరోవైపు సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు అండగా నిలిచాయి. అయితే ఓటర్లు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల నుంచే కాకుండా డిగ్రీ పూర్తి చేసిన చాలామంది నమోదు చేసుకున్నారు. దీంతో వారి తీర్పు ఈ దఫా కీలకం కానుంది. ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారు ధీమా


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

(మిగతా 7వ పేజీలో)

అమరావతిలో.. అతి పెద్ద స్టేడియం


మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- స్పోర్ట్స్‌సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- అంతాసవ్యంగా జరిగితే 2027 కల్లా ఆవిర్భావం
- ఏసీఏకు 60 ఎకరాలు ఉచితంగా ఇవ్వనున్న ప్రభుత్వం
- రాజధాని సిగలో మరో ఆణిముత్యంగా భాసిల్లేలా మంత్రి లోకేశ్ ప్రణాళిక

రివర్‌ఫ్రంట్.. గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి ఆవిర్భవించబోతున్నది. ఇలాంటి రాజధాని నగరం క్రీడారంగంలో కూడా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోనున్నది. అమరావతి.. ప్రపంచ క్రీడారంగానికి ఓ దిక్సూచిగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. క్రికెట్ ప్రపంచానికి మరో మెల్‌బోర్న్‌గా అమరావతి స్పోర్ట్స్‌సిటీని తీర్చిదిద్దనున్నది. ఈ క్రమంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని అత్యాధునికంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మంత్రి లోకేశ్ సూచన మేరకు 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.800 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణం జరగనున్నది. క్రికెట్ ప్రపంచానికి తలమానికంగా అమరావతిలో క్రికెట్ స్టేడియం నిర్మించే విషయంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మంత్రి లోకేశ్‌కు సహకరిస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే 2027 కల్లా అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అమరావతిలో ఆవిర్భవించనున్నది.

మంగళగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనేక ప్రత్యేకతలకు నిలయంగా మారనున్న అమరావతిలో ఏ నిర్మాణం చేపట్టినా.. మరే ప్రాజెక్టును తలపెట్టినా అదో ఐకానిక్‌గా ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఉండాలన్న పట్టుదల చంద్రబాబుది. అమరావతి నిర్మాణంలో భాగంగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని కూడా అదరహో అన్న చందాన నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటికే ప్రపంచంలో అతిపెద్దదిగా ఉన్న అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంను మించి మరిన్ని సౌకర్యాలతో అమరావతిలో అగ్రగామిగా నిర్మించాలని నిర్ణయించారు. అమరావతి మాస్టర్‌ప్లానులో క్రీడా నగరాన్ని ప్రభుత్వ నగరానికి పశ్చిమంగా నదీతీరం వెంబడి సుమారు 1600 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత భౌతిక పరిస్థితులకు అనుగుణంగా చెప్పాలంటే బోరుపాలెం, అబ్బురాజుపాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, తుళ్లూరు పరిధిలో క్రీడా నగరం ఏర్పాటుకానున్నది. ఈ ప్రాంతంలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని భారీ హంగులతో నిర్మించాలని మంత్రి లోకేశ్ ప్రభుత్వానికి సూచించారు. తన ఈ ఆలోచనను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ఆయన ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాలను పరిశీలించే కార్యక్రమాన్ని ఇప్పటికే చేపట్టారు. గతవారం షార్జాలో భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను శివనాథ్‌తో కలిసి తిలకించిన మంత్రి లోకేశ్.. అక్కడ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు జైషాను కలిసి అమరావతి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం గురించి చర్చించారు.

రూ.800 కోట్లకు పైగా ఖర్చు

అమరావతిలోని స్పోర్ట్స్ సిటీలో రివర్ ఫ్రంట్ స్టేడియంగా దీనిని నిర్మించాలని ప్రాథమికంగా లోకేశ్ నిర్ణయించారు. ఇందుకోసం 60 ఎకరాలను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు ఉచితంగా ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని సూచనప్రాయంగా తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నరేంద్ర మోదీ స్టేడియంను రూ.800 కోట్లతో లక్షా 32 వేల సీటింగ్ సామర్థ్యంతో 63 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఇది మెల్‌బోర్న్ స్టేడియంను దాటేసి ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలిచింది. అయితే అమరావతి నరేంద్రమోదీ స్టేడియంను మించి నిర్మించాలంటే భారీ వ్యయమవుతోందన్న (రూ.800 కోట్లను మించి) అంచనాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ భారీ వ్యయాన్ని అందుకునేందుకు బీసీసీఐ నిధులకు తోడు మరికొన్ని నిధులను ప్రైవేటు సెక్టారు నుంచి సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దానికి సంబంధించిన సాధ్యాసాధ్యాల గురించి ప్రభుత్వం కూలంకుషంగా చర్చిస్తుంది.

ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తాం...



రాజధాని అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపులు చేసిన వెంటనే నిర్మాణ పనులను ఆరంభిస్తాం. అహ్మదాబాద్ స్టేడి యానికి ఏ మాత్రం తీసిపోని విధంగా నిర్మిస్తాం. అలాగే మంగళగి రిలోని స్టేడియాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తాం రంజీ మ్యాచ్‌ల వరకు మంగళగిరి స్టేడియాన్ని వినియోగించుకుంటాం. అమరావతిలో నిర్మించాలనుకుంటున్న అంతర్జాతీయ స్టేడియం గురించి మంత్రి నారా లోకేశ్ ఐసీసీ, బీసీసీఐ ప్రతినిధులతో నిరంతరం చర్చిస్తున్నారు. **- కేశినేని శివనాథ్, ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ**

రెండు అంతర్జాతీయ స్టేడియాలు

అమరావతిలోని స్పోర్ట్స్‌సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మిస్తే.. రాజధాని అమరావతిలో రెండు అంతర్జాతీయ స్టేడియాలు అవుతాయి. మంగళగిరిలోని అమరావతి టౌన్‌షిప్‌లో రూ.వంద కోట్లతో నిర్మించిన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు చివరిదశకు వచ్చాయి. ఇంకో పాతిక, ముప్పై కోట్లు ఖర్చు చేస్తే అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు ఈ స్టేడియం సిద్ధమవుతుంది. స్టేడియం చుట్టూ గ్రీనరీతోపాటు రోడ్లు, లైటింగ్, హోటల్ వంటి సౌకర్యాలతో పాటు నిడమర్రు రోడ్డులో రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్‌ను నిర్మించాలి. ఈ పనులు ఏడాదిలోగా పూర్తి చేస్తామని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తాజాగా ప్రకటించారు. అయితే అమరావతి స్పోర్ట్స్ సిటీలో క్రికెట్ స్టేడియంను నిర్మించాలన్న ప్రతిపాదనల నేపథ్యంలో మంగళగిరి స్టేడియాన్ని పూర్తి చేస్తారా లేదా అన్నది సంశయాత్మకంగా మారింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.21 (సోమవారం)
సహరి : 5.08 (మంగళవారం)

రాయితీపై.. రుణాలు

- ఈబీసీల కోసం ప్రభుత్వం కసరత్తు
- 9వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- బీసీ కార్పొరేషన్ ద్వారా పంపిణీకి చర్యలు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ మొదలు
- మూడు జిల్లాల పరిధిలో 15,000 మందికి లబ్ధి
- బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అగ్రవర్ణాల్లోని పేదలకు ఊతమివ్వడానికి కూటమి ప్రభుత్వం రాయితీపై రుణాలివ్వడానికి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ మేరకు జిల్లాల వారీగా యూనిట్ల కేటాయింపు, కులాల వారీగా మార్గదర్శకాలను గతంలోనే విడుదల చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈ నెల 9 నుంచి ఈబీసీ రుణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని అధికారులు చెబుతున్నారు. గతంలో మంజూరు చేసిన యూనిట్లకు అదనంగా కుట్టుమిషన్లు, జనరిక్ షాపుల కేటాయింపులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా యూనిట్ల వారీగా అర్హత సాధించిన లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనుంది. ఈబీసీ రుణాలను కూడా బీసీ కార్పొరేషన్ ద్వారానే ప్రభుత్వం ఇవ్వనుంది. తాజా బడ్జెట్ కేటాయింపుల్లో బీసీ కార్పొరేషన్‌కు నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించింది. నిధుల సమస్య కూడా లేనందున దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల గుర్తింపు జరిపి మార్చి నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేసి అగ్రవర్ణ పేదలకు లబ్ధి చేకూరుస్తామని అధికారులు చెబుతున్నారు. ఈబీసీ కోటా కింద గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 15,000 మందికి లబ్ధి చేకూర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాలో 3,600 మందికి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిపి 11,400 మందికి ఈ పథకం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రణాళికలు రచించింది. రాయితీ రుణాలపై అందించే యూనిట్లలో ప్రధానంగా ఫ్యాషన్ డిజైనింగ్, డెయిరీలు, ఇతర చిన్న తరహా యూనిట్లకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుం ది. రాయితీ రుణాల నిమిత్తం మూడు జిల్లాల పరిధిలో రూ.130 కోట్ల వరకు రుణాలను ప్రభుత్వం లబ్ధిదారులకు అందించనుంది. ఈ యూనిట్లకు తోడు అదనంగా కుట్టుమిషన్ల రూపంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 16,000 మంది అగ్రవర్ణ పేదలకు మేలు జరిగేలా చూడాలని నిర్ణయించింది. వీటితో పాటు బీ ఫార్మసీ కోర్సుల్లో అర్హత ఉన్న వారికి శిక్షణ ఇచ్చి ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయబోయే జనరిక్ దుకాణాల్లో కూడా వాటా ఇవ్వనున్నది.


ఈబీసీ రుణాలపై సమీక్ష చేస్తున్న జేసీ ప్రఖర్‌జైన్ (పాత చిత్రం)

ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పూర్తి..

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా అట్టడుగున ఉన్న వారి సంఖ్య తేల్చడానికి ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసింది. ఈబీసీ కేటగిరీలోకి వచ్చే రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, కాపుతో పాటు ఇతర కులాల్లో ఉండే పేదల జాబితాను రూపొందించింది. ఈ నెల 9 నుంచి ఈబీసీ రాయితీ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ జరగనున్నది. వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న డేటాతో సరిపోల్చుకుని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

70,000 దరఖాస్తులు వస్తాయని అంచనా

ఈబీసీ రాయితీ రుణాల కోసం మూడు జిల్లాల పరిధిలో దాదాపు 70,000 వరకు దరఖాస్తులు వస్తాయనేది అధికారుల అంచనా. ప్రభుత్వం కేటాయించిన 15,000 యూనిట్లు తొలి విడతలో భాగమేనని, ఈబీసీ కేటగిరి కిందకు వచ్చే అర్హులైన పేదలందరికీ దశల వారీగా న్యాయం జరిగేలా చూస్తామనేది ప్రభుత్వ మాటగా ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వంలో దాదాపు 4,000 దరఖాస్తులు ఈబీసీ రాయితీ రుణాల కోసం వచ్చినవి ఉన్నాయి. వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా గత ప్రభుత్వం తాత్సారం చేయడంతో పాటు రాయితీ రుణాల నిధులను కూడా పక్కదారి మళ్లించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జరిగే ప్రక్రియలో వైసీపీ ప్రభుత్వంలో మూలన పడిన దరఖాస్తుల్లో అర్హులైన వారు ఉంటే వారికి కూడా ప్రయోజనం దక్కేలా చూడనున్నారు.

మహిళలకే తొలి ప్రాధాన్యం..

స్వయం ఉపాధి యూనిట్ల కోసం అందించే రాయితీ రుణాల విషయంలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. దానిలో భాగంగానే సదరు యూనిట్లు కూడా ఎక్కువ శాతం అతివలకు సంబంధించినవే ఉన్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్, బొటిక్స్, ఈవెంట్ ఆర్గనైజింగ్ వంటి వన్నీ కూడా ఎక్కువ శాతం మహిళలు రాణిస్తున్న రంగాలే కావడం గమనార్హం.

ఆయా రంగాల్లో నిపుణులచే శిక్షణ..

యూనిట్లు కేటాయించడమే కాకుండా వారు ఎంచుకున్న రంగంలో విజయం సాధించేలా నిపుణుల చేత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వమే చేపట్టనుంది. ఇప్పటికే లబ్ధిదారులు ఎంచుకున్న రంగంపై వారికి అవగాహన ఉంటే మరింత సానపట్టి వారిచేతే మిగిలిన వారికి శిక్షణ ఇప్పించే ప్రయత్నం కూడా అధికారులు చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడాన్నే అత్యంత కీలకం. శిక్షణకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలను జారీ చేసింది.

బకాయిలు రూ.14 కోట్లు



- కొండలా పేరుకుపోయిన నీటితీరువా
- ఏళ్ల తరబడి చెల్లింపులు జరపని వైనం
- సాగునీటి కాల్వలపై దృష్టి సారించని గత ప్రభుత్వం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిధిలో నీటి తీరువా బకాయిలు ఏళ్ల తరబడి కొండలా పేరుకుపోయి ఉన్నాయి. జిల్లాలో నీటి తీరువా బకాయిలు రూ.14 కోట్ల వరకు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం వీటి వసూళ్లపై పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో బకాయిలు ఈ స్థాయిలో ఉండడానికి కారణంగా ఉంది. గత ఏడాది అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సాగునీటి రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తొలుత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఆయా సంఘాలు ఇటీవల కొలువుదీరాయి. ఈ పరిస్థితుల్లో నీటి తీరువా బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ఆదేశాలతో రెవెన్యూ విభాగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రతి ఏడాది జూన్ మొదలుకుని నాలుగు నెలల పాటు సీజన్ల వారీగా ఈ తీరువాను వసూలు చేస్తారు. ఆయకట్టు కింద ఉన్న ప్రతి రైతు ఏడాదికి రూ.200 చెల్లించాల్సి ఉంది. రేపల్లె రెవెన్యూ డివిజన్ కింద రూ.5.50 కోట్లు బకాయిలు ఉండగా, చీరాల కింద రూ.5 కోట్లు, బాపట్ల రెవెన్యూ డివిజన్‌లో రూ.3.50 కోట్లు నీటీ తీరువా కింద రైతులు చెల్లించాల్సి ఉంది.

సాగునీటి సంఘాలు కొలువుదీరడంతో...

అస్తవ్యస్తంగా ఉన్న సాగునీటి రంగాన్ని తిరిగి గాడిన పెట్టాలంటే ముందుగా సదరు సంఘాలకు పాలకవర్గాలను నియమించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఇటీవలే జిల్లా వ్యాప్తంగా టీసీలకు, డీసీలకు పాలక వర్గాలను కొలువుదీర్చింది. దీంతో రైతుల నుంచి కాల్వల బాగు కోసం సంబంధించిన అభ్యర్థనలు వందల సంఖ్యలో ఆయా నీటి సంఘాల పదవుల్లో ఉన్న వారి వద్దకు వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇలా వచ్చిన అర్జీల సంఖ్య ఇప్పటి వరకు దాదాపు 500 వరకు ఉన్నాయంటే గత ప్రభుత్వం ఏ విధంగా సాగునీటి రంగాన్ని పడకేయించిందో అర్థమవుతోంది. వచ్చిన అర్జీలు ఎక్కువ శాతం తమ సాగు చివరి ఆయకట్టు కింద ఉందని, గడచిన ఐదేళ్లలో నీరు అందక తీవ్రంగా నష్టపోయామని న్యాయం చేయాలనే వినతులు వచ్చాయి. వీటితో పాటు చిన్నపాటి వర్షాలకే డ్రెయినేజీలు పొంగి ఆ నీరు పొలాల్లోకి వస్తుందని, తక్షణమే కాల్వల మరమ్మతు చేపట్టాలనే అర్జీలూ గణనీయంగానే ఉన్నాయి. అలా అందిన వాటిలో దాదాపు రూ.22 కోట్ల వరకు వ్యయం కాగల పనులు ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నీటితీరువా వసూలయితేనే ఆ నిధులను కాల్వల మర్మతులకు కేటాయిస్తే పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. దీంతో పాటు ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటికే దాదాపు 2 కోట్లతో కాల్వల్లో పూడికతీత పనులను ఈ ఎనిమిది నెలల కాలంలో చేపట్టింది. పూర్తి స్థాయిలో కాల్వలు బాగుపడాలన్నా, కరకట్టల భద్రత పటిష్ఠంగా ఉండాలన్నా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా నీటి తీరువా వసూలుపై యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది.

నిధులే కీలకం..

కాల్వల మరమ్మతుల మొదలుకుని కరకట్టలను పటిష్ఠ పరిచే వరకు పనులు వేగంగా జరగాలంటే నిధుల లభ్యతే కీలకం కానుంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నిధుల విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్నది. అయితే మరమ్మతులకు అయ్యే వ్యయం కోట్లలో ఉండడంతో నీటి తీరువా బకాయిల మీద ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మొత్తాలను కూడా గత ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో రైతులు తీరువా చెల్లించడానికి ముందుకు రాని పరిస్థితి క్షేత్ర స్థాయిలో ఉంది. నీటి తీరువా మొత్తాలను తిరిగి ఆ ఆయకట్టు రైతుల బాగు కోసమే ఖర్చు పెట్టడమే రివాజు. నీటి తీరువా పెండింగ్ బకాయిలు చెల్లించే విధంగా రైతులకు అవగాహన కల్పించడంతో నీటి కష్టాలపై కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

గత ఐదేళ్లూ కడగండ్లే..

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల పాటు కాల్వలలో కనీసం పూడిక తీత పనులను చేపట్టకుండా అన్నదాతల కడగండ్లకు కారణమైంది. సాగునీరు సకాలంలో అందక చివరి ఆయకట్టు రైతుల గోడు అలకించేవారే కరువయ్యారు. ఇదే సమయంలో నీటి తీరువా వసూలు చేసి ఆ మొత్తాలను కాల్వల నిర్వహణకు కేటాయించాల్సి ఉన్నా అలాంటి ప్రయత్నమేమీ గత ప్రభుత్వంలో జరగలేదు. పైగా సచివాలయాల వద్ద తీరువా చెల్లించాలంటూ రైతులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం సకాలంలో నీరందించడంలో ప్రణాళికలు లేకుండా వ్యవహించడం వల్లే తమకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయని గత ప్రభుత్వంలో రైతులు బలంగా నమ్మారు. దీంతో నీటి తీరువా కట్టడానికి రైతులు ముందుకు రాలేదు. ఓ దశలో ఆ మొత్తాలను కూడా పక్కదారి పట్టించిన ఘనత గత ప్రభుత్వానిది.

ఆదాయ మార్గంగా.. అక్రమ మైనింగ్

- వైసీపీ నేతల బాటలోనే కూటమి నేతలు
- కోటప్పకొండ దేవస్థాన భూముల్లోనూ మైనింగ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండను తవ్వేస్తున్నారు.. గతంలో వైసీపీ నేతలు కొండపై కన్నేశారు. ఇప్పుడు కూటమిలోని కొందరు నేతలు కొండతో పాటు ఆలయ భూములను చెరపట్టేశారు. అధికారం మారిందే కాని కోటప్పకొండ ప్రాంతంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. వైసీపీ నేతల బాటలోనే కూటమిలోని కొందరు నేతలు అక్రమ మైనింగ్‌ను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. అక్రమ మైనింగ్‌పై మండల స్థాయిలో ఏర్పాటు చేసిన అధికారుల కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. క్రషర్లు ఉన్న రోడ్డులో కోటప్పకొండ దేవస్థానం భూములు ఉన్నాయి. వీటిని రైతులకు కౌలుకు ఇచ్చారు. ఈ భూముల్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. అదేమని అడిగితే అధికారం మాది ఏమైనా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ప్రజాప్రతినిధి బంధువుగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి కనుసన్నల్లో మట్టి మైనింగ్ జరుగుతోందని సమాచారం.


మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతం

గ్రాడ్యుయేషన్ వరకు మన దేశంలో చదివినా, ఉన్నత విద్య మాత్రం విదేశాల్లో చదువుకుని కెరీర్‌లో గొప్పగా స్థిరపడాలనేది చాలా మంది విద్యార్థుల కోరిక. దీని వల్ల చాలా ఉపయోగాలు కూడా ఉన్నాయి. కొత్త సంస్కృతులు పరిచయం అవుతాయి, కెరీర్ అవకాశాలు పెరుగుతాయి, నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయి. అందుకే మన దేశంలో ప్రతీ సంవత్సరం విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల సంఖ్య దిన దిన ప్రవర్ధమానం అవుతోంది. అయితే ఉన్నత విద్యకు ఏయే దేశాలు-యూనివర్సిటీలు మంచివి, ఎంత ఖర్చు అవుతుంది, వీసా కోసం ఏయే పత్రాలు అవసరం అవుతాయి, ప్రాసెసింగ్ ఎలా చేయించుకోవాలి అనే విషయం చాలా మందికి అవగాహన ఉండదు. విదేశీ విద్యకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సహకరించడానికి మన దగ్గర ఫారెన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. వీటిని సంప్రదిస్తే సరైన గైడెన్స్ లభిస్తుంది. తరువాత సులువుగా కావాల్సిన డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవచ్చు.

కోవిడ్ ముందుతో పోలిస్తే తరువాత విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 52 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సంలో భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లి చదువుకున్న విద్యార్థుల సంఖ్య 8,94,783. ప్రపంచ వ్యాప్తంగా చైనా తరువాత ఉన్నత విద్య కోసం అత్యధికంగా విదేశాలకు వెళుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మన విద్యార్థుల ప్రాధాన్యంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకేలు వరుసగా ఉన్నాయి. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ నివేదిక ప్రకారం 2023-24 అకడమిక్ ఇయర్‌లో అమెరికాకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 3,37,630. అయితే కెనడా ఇబ్బందుల కారణంగా ఈ విద్యా సంవత్సరం అక్కడికి వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇంత పెద్ద మొత్తంలో విదేశాలకు వెళుతున్న విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న కన్సల్టెన్సీల సేవల పొందుతున్నారు. భారతదేశంలో పేరున్న కన్సల్టెన్సీల్లో ఇవికొన్ని...

విదేశీ విద్యకి బెస్ట్ కన్సల్టెన్సీలు

» ఐడీపీ ఎడ్యుకేషన్

ఐదు దశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సర్వీసులో ఉన్న పెద్ద సంస్థ ఇది. ఆస్ట్రేలియన్ ఆసియన్ యూనివర్సిటీస్ కో-ఆపరేషన్‌గా మొదలై కాలక్రమంలో 'ఐడీపీ ఎడ్యుకేషన్' పేరు మార్చుకుంది. విదేశీ విద్యకు సంబంధించి పలు సేవలు అందిస్తుంది. www.idp.com/india/

» ఇన్ఫినిటీ గ్రూప్

ఇన్ఫినిటీ గ్రూప్ రెండు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. ఈ సెక్టార్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న 'ఇన్ఫినిటీ'కి 300 యూనివర్సిటీ పార్టనర్‌షిప్, 2500 గ్లోబల్ పార్ట్‌నర్స్ ఉన్నారు. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్ ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్, ఎండ్ టు ఎండ్ అసిస్టెన్స్‌లో ఉంటుంది. https://infinitegroup.global/



» వై యాక్సిస్

భారతదేశంలోని పేరొందిన నమ్మకమైన స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీల్లో 'వై యాక్సిస్' ఒకటి. 25 సంవత్సరాల పైన ఈ సంస్థ కన్సల్టెన్సీ సర్వీసులో ఉంది. స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కౌన్సెలింగ్, వీసా అసిస్టెన్స్, కెరీర్ కౌన్సెలింగ్, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లో 'వై యాక్సిస్' సహాయం చేస్తుంది. https://www.yaxis.com/

» ఎడ్వైస్ ఇంటర్నేషనల్

'ఎడ్వైస్ ఇంటర్నేషనల్' మూడు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. దేశంలోని పాత కన్సల్టెన్సీల్లో ఇది ఒకటి. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్ ప్రి డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. స్కాలర్‌షిప్స్, ఫైనాన్షియల్ ఎయిడ్‌కు సంబంధించిన సమాచారం కూడా ఇస్తుంది. https://www.edwiseinternational.com/

» 'మాన్య గ్రూప్'(ద ప్రిన్స్‌టన్ రివ్యూ ఇండియా)

దేశంలోని ఎస్టాబ్లిష్డ్ కన్సల్టెన్సీల్లో 'మాన్య గ్రూప్' ఒకటి. రెండు దశాబ్దాలకు పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో రెప్యూటెడ్ గ్రూప్ ఇది. పలు ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ కొనసాగిస్తోంది. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, శాట్/ఏసీటీ/జీఆర్‌ఈ/జీమాట్/ఐఈఎల్‌టీఎస్/ టోఫెల్ ప్రిపరేషన్, లాంగ్వేజ్ ట్రైనింగ్, కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు నిర్వహిస్తుంది. https://www.manya-group.com/

» కెరీర్ మ్యాట్రిక్స్

ఒకటిన్నర దశాబ్దం పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో ఉన్న సంస్థ ఇది. పలు యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ ఉంది స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. https://careermatrix.in/

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోసం 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025'



నాలుగు సంవత్సరాల 'ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్'లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025' పేరిట జరిగే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది.. ఈ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 64 విద్యా సంస్థల్లోని 6,100 సీట్లలో అడ్మిషన్లు పొందవచ్చు. పరీక్షల్లో ర్యాంకు ఆధారంగా ఆయా సంస్థలు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించి బీఏ-బీఈడీ, బీకాం-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తాయి. ఇంటర్ విద్యార్హత ఉన్న వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరడానికి ఎలాంటి వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలను అడుగుతారు. ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, హిందీతోపాటు 13 భాషల్లో జరుగుతుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 16 **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 29

నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఉపాధ్యాయ విద్యలో కూడా మార్పులు చేర్పులు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులో యోగా, వ్యాయమ విద్య, ఆర్ట్స్, సంస్కృతం ప్రవేశపెట్టనున్నారు. ఇవి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఇప్పటి వరకు ఏ కోర్సులోనైనా విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి అన్న నిబంధన ఉండేది. ఇక దీనిని 2026-27 విద్యా సంవత్సరం నుంచి 80 శాతానికి పెంచనున్నారు. ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ పూర్తి వివరాలకు exams.nta.ac.in/NCET/ వెబ్‌సైట్ చూడవచ్చు.

దిక్సూచి DIKSUCHI

1161 కానిస్టేబుల్/ ట్రేడ్స్‌మన్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో వివిధ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న 1161 కానిస్టేబుల్ ట్రేడ్స్‌మన్ పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 3. నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఖాళీల్లో 493 కానిస్టేబుల్/కుక్, కానిస్టేబుల్/వాషర్‌మన్ 262, కానిస్టేబుల్ బార్బర్ 199, కానిస్టేబుల్/స్వీపర్ 152, కానిస్టేబుల్/కార్పెంటర్ 9, కానిస్టేబుల్/టైలర్ 23 మొదలైన 13 రకాల పోస్టులు ఉన్నాయి. ఫిజికల్ స్టాండెడ్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల వయస్సు 2025 ఆగస్ట్1వ తేదీ నాటికి 18 నుంచి 23 సంవత్సరాల వయస్సులో ఉండాలి. 2025 మార్చి 5వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాలు

1124 కానిస్టేబుల్/ డ్రైవర్

సీఐఎస్ఎఫ్‌లో 1124 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులతో నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో 845 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులు, కానిస్టేబుల్/ డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్ పోస్టులు 279 ఉన్నాయి. పదో తరగతితోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 4. దరఖాస్తు దాఖలు చివరి తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 21 నుంచి 27 మధ్యలో ఉండాలి. రెండు పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం https://cisfrectt.cisf.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

J N Tata Endowment Loan Scholarship

Description: The J N Tata Endowment (J N Tata Endowment Loan Scholarship for Fall 2025 to Spring 2026) invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India.

- Candidates must be interested in pursuing Post -graduate/Doctoral/Postdoctoral studies abroad.
- The course for which candidates are admitted must be recognized as a Graduate Program (post-graduate in Indian terminology).
- Candidates who did not get selected in the previous year/earlier for the J N Tata Endowment loan scholarship and candidates who could not avail of the loan scholarship when they were selected, are eligible to apply afresh.
- Candidates who are already pursuing post-graduate studies overseas may apply either at the end of their 1 st of studies or at the commencement of the 2 nd year, provided there is a minimum of one full academic year (12 months) remaining to be completed at the time of the loan scholarship award, typically in July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or post-graduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2025.

Prizes & Rewards: Loan scholarship of upto Rs. 10 lakhs

Last Date: 07-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/JNT9

SCHOLARSHIP ALERT

NIT Rourkela Summer Internship

Description: The NIT Rourkela Summer Internship Programme 2025 is available for students pursuing undergraduation and master's degrees at the National Institute of Technology, Rourkela. It encourages students to undertake innovative research and development projects.

Eligibility: Applicants must be pursuing one of the following: B.E./B.Tech (4th semester exam completed), B.Arch/Integrated M.Sc./M.Tech/Dual degree (6th semester exam completed), or M.Sc./MA/MBA (2nd semester exam completed). A good academic record and marks/grade sheets of previous semesters shall be required. Applicants must remain available for internship from May 16 to July 15, 2025.

Prizes & Rewards: 7,500 per month and other benefits. ***Last Date:*** 10-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/NRSI1

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సినిమాలు తీయడం కంటే ఐఏఎస్ సాధించడం సులువు



- సందీప్‌రెడ్డి వంగా

ప్రభాస్‌తో తెరకెక్కించనున్న 'స్పిరిట్' చిత్రం 'బాహుబలి' కలెక్షన్లను దాటి రూ.2000 కోట్ల వసూళ్లు సంపాదిస్తుందా లేదా అనేది నేను చెప్పలేను. కానీ ఓ వైవిధ్యమైన చిత్రాన్ని మాత్రం ప్రేక్షకులకు అందిస్తాను అని సందీప్ రెడ్డి వంగా అన్నారు. ఇటీవలె 'గేమ్ ఛేంజర్స్' అనే షోలో ఆయన పాల్గొన్నారు. ఇందులో పలు విషయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే, తన దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమాపై గతంలో మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి చేసిన విమర్శలను సందీప్ గుర్తుచేసుకున్నారు. "ఆ అధికారి చేసిన వ్యాఖ్యలు నాకింకా గుర్తున్నాయి. ఇలాంటి సినిమాలు తెరకెక్కించకూడదన్నది ఆయన ఉద్దేశం. 'యానిమల్' సమాజాన్ని పదేళ్లు వెనక్కితీసుకెళ్తుందని ఆయన విమర్శించారు. అవి నన్ను చాలా బాధించాయి. నేనేదో నేరం చేసినట్లు అనిపించింది. ఆయన అనవసరంగా నా సినిమాపై అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అనిపించింది. ఓ ఐఏఎస్ అధికారి కావాలంటే కోచింగ్ సెంటర్లకు వెళ్లి, కొన్నేళ్లపాటు శిక్షణ తీసుకుంటూ కష్టపడి చదివితే సరిపోతుంది. కానీ ఓ ఫిల్మ్‌మేకర్ లేదా రచయిత కావాలనుకుంటే సరైన మార్గదర్శకాలు ఇచ్చే టీచర్లు, కోర్సులు ఉండవు. ఓ ఫిల్మ్‌మేకర్ తనకు తానుగా అన్నీ నేర్చుకోవాలి. తన తపన, ఆసక్తి, అభిరుచి, కష్టంతోనే ముందుకు సాగాలి. ఈ విషయాన్ని కావాలంటే నేను పేపర్‌పై కూడా రాసి ఇస్తాను" అని పేర్కొన్నారు. కాగా, 'ట్వెల్త్ ఫెయిల్' సినిమాలో కీలక పాత్రలో నటించారు మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి. సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంలో 'ట్వెల్త్ ఫెయిల్' లాంటి సినిమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయనీ, 'యానిమల్' సినిమాలో సామాజిక విలువలు లోపించాయని విమర్శించారు.

కథ చెబితే బహుమానం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ హీరో, హీరోయిన్లుగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్ రుబా'. సారెగమ సంస్థ, రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మాతలు. హోలీ పండుగ సందర్భంగా మార్చి 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఓ పోటీని ప్రకటించారు హీరో కిరణ్ అబ్బవరం.' దిల్ రూబా' చిత్రం కథను ముందుగానే ఊహించి చెప్పిన వాళ్లకు ఈ సినిమాలో హీరో నడిపిన ద్విచక్ర వాహనం బహుమతిగా అందజేస్తామన్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజేతకు ఈ బహుమతిని అందజేస్తారు.



స్మగ్లర్లను హీరోలుగా చూపడం సరికాదు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

'పాత సినిమాల్లో చివరకు హీరో చేతిలో విలన్ అంతమయ్యేవాడు. లేదంటే రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్లేవాడు. ఇప్పుడు నెగిటివ్ క్యారెక్టర్లను సైతం హీరోలుగా చూపిస్తున్నారు. స్మగ్లర్లు, దేశ ద్రోహులకు హీరోయిజాన్ని ఆపాదించడం సరికాదు. ఆ పాత్రల్లో హీరోలు గొప్పగా నటించినంత మాత్రాన వాటిని ఆదర్శంగా చూపించడం సమంజసం కాదు. ఈ తరం అర్థవంతమైన సినిమాలు తీయాలి. ప్రమాణాలు పాటించాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. సీనియర్ నటి కృష్ణవేణి సంస్మరణ సభను ఫిల్మ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. చలన చిత్ర నటిగా, నిర్మాతగా, నేపథ్య గాయనిగా, శోభనాచల స్టూడియో అధినేతగా కృష్ణవేణి తెలుగు సినిమా రంగంలో ఓ సువర్ణాధ్యాయం లిఖించారని ఆయన కొనియాడారు. 'మనదేశం' చిత్రంలో నందమూరి తారకరామారావును పరిచయం చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. అలాగే మీర్జాపురం రాజా, కృష్ణవేణి దంపతుల వల్లనే 'కీలుగుర్రం' చిత్రంతో అక్కినేని నాగేశ్వరరావుకి స్టార్ స్టేటస్ వచ్చిందని వెంకయ్య నాయుడు చెప్పారు. 'మా తండ్రిగారిని సినిమా రంగానికి పరిచయం చేసిన కృష్ణవేణమ్మ సంస్మరణ సభలో మేం కూడా భాగస్వాములైనందుకు గర్విస్తున్నాం' అని నందమూరి మోహన కృష్ణ, రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేని రమేశ్ ప్రసాద్, మురళీ మోహన్, డా.పరుచూరి గోపాల కృష్ణ, నిర్మాతలు కె.ఎస్.రామారావు, కైకాల నాగేశ్వరరావు, తుమ్మల ప్రసన్న కుమార్, కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మోగ్లీ పోరాటం



సందీప్ రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. అటవీ నేపథ్యంలో సాగే ఈ అందమైన ప్రేమకథలో సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రంపచోడవరం, మారేడుమిల్లి ఫారెస్ట్‌లో జరుగుతోంది. సినిమాకు ఆకర్షణగా నిలిచే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. 'మోగ్లీ 2025' ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాల భైరవ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ మారుతి ఎం.

ఇళయరాజా స్టూడియోలో సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం భేటీ అయ్యారు. స్థానిక కోడంబాక్కంలోని ఇళయరాజా మ్యూజిక్ స్టూడియోకు వెళ్లిన స్టాలిన్.. ఆయనతో అరగంటపాటు సమావేశమయ్యారు. ఈ నెల 8వ తేదీన లండన్‌లో ఇళయరాజా సింఫనీ అరంగేట్రం జరుగనుండగా, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించేందుకు స్టాలిన్ వెళ్లినట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై సీఎం స్టాలిన్ కూడా తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ఆసియా ఖండంలోనే ఎవరూ చేయని ఘనతను ఈ నెల 8వ తేదీన లండన్‌లో సింఫనీ అరంగేంట్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు మన ప్రియమైన రాజా. తమిళనాడు గర్వించదగ్గ సంగీత విద్వాంసుణ్ణి అభినందించేందుకు స్వయంగా ఆయన స్టూడియోకు వెళ్లాను. ఆయన స్వయంగా చేతితో రాసిన 'వయలెంట్ సింఫనీ' సంగీత నోట్స్‌ను నాకు చూపించారు. ప్రపంచ తమిళ ప్రజల సంగీత శ్వాసగా మారిన ఇళయరాజా తలపెట్టిన ఈ సింఫనీ అరంగేట్రం విజయవంతంగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను' అని స్టాలిన్ ఆకాంక్షించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునే ప్రేమకథ



త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా మల్లి యేలూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జిగేల్'. డాక్టర్ వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ప్రేమకథ ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, డీఓపీ: వాసు, సంగీతం: ఆనంద్ మంత్ర.



అవి డీప్‌ఫేక్ వీడియోలు

విద్యాబాలన్

నన్ను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన పలు డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఉన్నది నేను కాదు, దయచేసి ఆ వీడియోలను వ్యాప్తి చేయవద్దు అని విద్యాబాలన్ నెటిజన్లను కోరారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. "సోషల్‌మీడియాలో ఈ మధ్య నాకు సంబంధించిన పలు వీడియోలు ఎక్కువగా షేర్ అవుతున్నాయి. ఆ వీడియోలు నేను చేసినవి కావు. అవి డీప్ ఫేక్ ద్వారా సృష్టించినవి. దయచేసి వాటిలో చెప్పే విషయాలను నమ్మొద్దు. అవి మిమ్మల్ని తప్పుదోవ పట్టించే అవకాశముంది" అని పేర్కొన్నారు.



ముందుగానే మ్యాడ్‌స్క్వేర్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. 'మ్యాడ్' కి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈనెల 29న విడుదల కావాల్సి ఉండగా, డిస్ట్రిబ్యూటర్ల కోరిక మేరకు ఒకరోజు ముందుగా మార్చి 28న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. 'మార్చి 29న అమావాస్య కావడంతో మా పంపిణీదారులు చిత్రాన్ని ముందు రోజే విడుదల చేయాలని కోరారు. ఈ నిర్ణయం పట్ల మేము కూడా సంతోషంగా ఉన్నాం' అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ తెలిపారు.

మాస్‌ను మెప్పించే కథతో



మలయాళ హీరో ఆంటోనీ వర్గీస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కట్టలన్'. 'మార్కో' చిత్రంతో నిర్మాతగా భారీ విజయాన్ని అందుకున్న షరీఫ్ నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌కు పాల్ జార్జ్ దర్శకుడు. ఆదివారం చిత్రబృందం ఆంటోనీ వర్గీస్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గంభీరమైన లుక్‌లో వర్గీస్ కనిపించారు. మాస్‌ను ఆకట్టుకునే అంశాలతో పాటు యాక్షన్ పార్ట్ ఈ సినిమాకు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని యూనిట్ తెలిపింది.

విభిన్నతరహా చిత్రం



ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య ద్వయం దర్శకత్వం వహిస్తుండగా, ఆర్.యు. రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. సంగీత దర్శకుడు ఆర్.పి పట్నాయక్ క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రసన్నకుమార్. టి, వంశీ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వీరశంకర్, నిర్మాత నవీన్ యెర్నేని స్క్రిప్టును అందజేశారు. సినిమా విభిన్న తరహాలో ఉండబోతోందని మేకర్స్ తెలిపారు.

జవాబుదారితనంతో విధులు నిర్వర్తించండి



శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరి ఎస్సైలకు దిశానిర్దేశం చేస్తున్న ఐజీ త్రిపాఠి

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి పోలీస్ శాఖ పేరు ప్రతిష్ఠలను ఇనుమడింప చేయాలని రేంజ్ ఐజీ ఎస్ఎస్‌పి త్రిపాఠి ఆదివారం సూచించారు. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరి ఎస్సైలను జిల్లాలకు కేటాయించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలకు అభినందనలు తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధి కింద 53 మంది ఎస్సైలు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని ఆదివారం ఐజీని మర్యాద పూర్వకంగా కలవగా, వారికి జిల్లాలను కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను అందించారు. వీరిలో 36 మంది పురుషులు, 17 మంది మహిళలు ఉన్నారు. గుంటూరు జిల్లాకు 22 మంది, పల్నాడు జిల్లాకు 13 మంది, బాపట్ల జిల్లాకు 10 మంది, ప్రకాశం జిల్లాకు ఒకరు, నెల్లూరు జిల్లాకు ముగ్గురు, తిరుపతి జిల్లాకు నలుగురిని కేటాయించారు. వారికి ఈ నెల 2 నుంచి 6 వరకు సెలవు మంజూరు చేసి, తిరిగి 7 నుంచి గ్రేహౌండ్స్ శిక్షణ కొరకు పంపించనున్నట్లు ఐజీ తెలిపారు.

'గ్రీన్ గ్రేస్'కు జారీ చేసిన ఈసీ ఆర్డర్స్ నిలుపుదల

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివాదాస్పద గ్రీన్ గ్రేస్ హైరైజ్డ్ అపార్టుమెంట్స్‌కు పర్యావరణ శాఖ గతంలో జారీ చేసిన ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ ఆర్డర్స్‌ని నిలుపుదల చేస్తూ రాష్ట్ర స్థాయి ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ(ఎస్ఈఐఏఏ) ఉత్తర్వులు జారీ చేసింది. గ్రీన్ గ్రేస్‌లో జరుగుతున్న అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అవిశ్రాంతంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ఆయన ఇటీవలే విజయవాడలోని ఎస్ఈఐఏఏ కార్యాలయానికి వెళ్లి గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్స్ యాజమాన్యం కన్‌సెంట్ టూ ఎస్టాబ్లిష్ (సీటీఈ)ని పర్యావరణ శాఖ నుంచి పొందలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ స్పందించి అన్ని వివరాలను ఇక్కడి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల నుంచి తెప్పించుకొన్నది. గత నెల 27వ తేదీనే ఆ ప్రాజెక్టుకి 2015 జూలై 9, 2021 జూలై 29వ తేదీన జారీ చేసిన ఈసీ ఆర్డర్స్‌ని నిలుపుదల చేసింది. ఏపీపీసీబీ నుంచి సీటీఈ తీసుకోకపోవడమే కాకుండా పరివేష్ పోర్టల్‌లో ప్రతి ఆరు నెలలకు అప్‌లోడింగ్ చేయాల్సిన కాంప్లియన్స్ రిపోర్టులను కూడా చేయలేదు. ఈ రెండు ఉల్లంఘనలను పరిగణనలోకి తీసుకొని పర్యావరణ అనుమతుల ఉత్తర్వులను నిలిపేస్తున్నట్లు ఆ సంస్థ ప్రొసీడింగ్స్ జారీ చేయగా అవి ఆదివారం వెలుగులోకి వచ్చాయి.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా షాలిమార్, సంత్రగచి, చర్లపల్లికి ప్రత్యేక రైళ్లను ఈ నెలలో నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07703 చర్లపల్లి - షాలిమార్ ప్రత్యేక రైలు ఈ నెల 9, 16 తేదీల్లో రాత్రి 7.45కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా రెండో రోజు వేకువజామునకు ముందు 2 గంటలకు షాలిమార్ చేరుకొంటుంది. నంబరు 07704 షాలిమార్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 11, 18 తేదీల్లో వేకువజామున 5 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 8.10కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 07705 చర్లపల్లి - సంత్రగచి ప్రత్యేక రైలు ఈ నెల 7, 21 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 10.30కి సంత్రగచి చేరుకొంటుంది. నంబరు 07706 సంత్రగచి - చర్లపల్లి రైలు ఈ నెల 8, 22 తేదీల్లో మధ్యాహ్నం 12.35కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.40కి చర్లపల్లి చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ వంట మీద ఆసక్తి కలిగిన మగవారు కావలెను. వయస్సు : 18-21 లోపల Contact : Pany's Kitchen LVR Club బ్రక్క రోడ్‌లో గుంటూరు. సెల్ : 9848214148.
AJG-210388

అమ్మకము

➡ గుంటూరు కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్, 7 గదులు, స్విమ్మింగ్ పూల్‌తో అమ్మకానికి కలదు. సంప్ర॥ 93976 03138.
AJG-210385

➡ SPM కాపీర్ పేపర్ షీటర్ లోటస్ ఇంజనీర్స్ మిషనరీ SBI వేలం ద్వారా అమ్మబడును. ఫోన్ : 96529 95559, 93475 44565
AAA-9933

రియల్ ఎస్టేట్

➡ శ్రీకృష్ణ బృందావనం ఫార్మ్ లాండ్ గుంటూరు నుండి బోయపాలెం మీదుగా కొండవీడు 25 కి.మీ. పర్యటక ప్రాంతం, సమీపంలో @ సెంటు - లక్ష రూపాయలు, 14 సెంట్లు, 10 సెంట్లు బిట్స్ కలవు. పక్కా రిజిస్ట్రేషన్, సంప్ర॥ 93814 49563.
AJG-210383

FLAT FOR SALE

➡ గుంటూరు సిటీలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో YSR బొమ్మ దగ్గర 3000 Sq.f. తో అన్ని వసతులతో అపార్ట్‌మెంట్‌లో డ్యూప్లెక్స్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ 9394113848.
AJG-210389


గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209310

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి



సదా మీ సేవలో
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్ - 97036 18725
గుంటూరు 2 టౌన్ - 99854 01056
తెనాలి - 99854 11202
నరసరావుపేట - 99854 11206
బాపట్ల - 99663 35084
పిడుగురాళ్ళ - 93909 05725
మంగళగిరి - 93986 73618
అమరావతి - 95027 86195
పొన్నూరు - 97042 99094
రేపల్లె - 99854 12254
చిలకలూరిపేట - 98852 71281
వినుకొండ - 99662 50266
మాచర్ల - 88861 19952
సత్తెనపల్లి - 91103 23914
ప్రత్తిపాడు - 63004 34285
సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

మిర్చియార్డుకు నూతన పాలకవర్గం

- ఈ నెలలోనే మార్కెట్ కమిటీలను భర్తీ చేస్తామన్న సీఎం
- ప్రయత్నాల్లో ఆశావహులు



గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు)కు ఈ నెలలోనే నూతన పాలకవర్గం ఖరారు చేసేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయించారు. అన్ని ఏఎంసీల్లో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ఆయన చేసిన ప్రకటన ఆశావహుల్లో ఆనందాన్ని కలిగిస్తుంది. ఇప్పటికే పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తి కావడంతో ఎప్పుడెప్పుడు మిర్చియార్డు చైర్మన్, పాలకవర్గ సభ్యులను నామినేట్ చేస్తారా అని వెయ్యి కళ్లతో నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. దీంతో మళ్లీ తమ నేతల ద్వారా అధిష్టానానికి సిఫార్సు చేయించేందుకు ప్రయత్నాలను ప్రారంభించారు. అయితే మిర్చియార్డు చైర్మన్ పదవి అనేది ఎంతో కీలకమైంది. దీనిని అన్ని కమిటీలతో పాటు భర్తీ చేస్తారా, ప్రత్యేకంగా చూస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

పదవికి డిమాండ్ తగ్గలేదు..

ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి వాణిజ్య కేంద్రంగా మిర్చియార్డుకు గుర్తింపు ఉంది. ఒకానొక సందర్భంలో చైర్మన్ పదవి ఎమ్మెల్యే స్థాయిలో ఉండేది. ఇందుకు కారణం అప్పట్లో ఈ యార్డు పరిధి ఎక్కువగా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయడంతో పరిధి తగ్గింది. దీనివలన కోల్డ్‌స్టోరేజ్‌లు, గొర్రెలమండి, ప్రత్తి, కారం మిల్లులు వంటివి ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి వెళ్లిపోయాయి. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా రైతులు తమ మిర్చిని అమ్ముకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. ఈ కారణంగా దాదాపుగా రూ. వెయ్యి కోట్లకు పైగా టర్నోవర్ ఇక్కడ జరుగుతున్నది. మార్కెట్ ఫీజు రూపంలోనే రూ.100 కోట్ల వరకు యార్డుకు ఆదాయం సమకూరుతుంది. దీంతో చైర్మన్ పదవికి డిమాండ్ పెద్దగా తగ్గలేదు.

తీవ్రమైన పోటీ...

మిర్చియార్డు చైర్మన్ పదవి కోసం తెలుగుదేశం పార్టీలో తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ మార్కెట్ కమిటీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉంది. అయితే గుంటూరు తూర్పు నియోజకవర్గం కూడా మిర్చియార్డు కిందకే వస్తుంది. దీని దృష్ట్యా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన నేతకు చైర్మన్ గిరిని ఇస్తారా, కేంద్ర మంత్రి ప్రతిపాదించే నాయకుడికి ఇస్తారా అన్నది సస్పెన్స్‌గా మారింది. ఇదే సమయంలో ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా రాష్ట్ర స్థాయిలోనే నిర్ణయం జరిగే అవకాశం కూడా లేకపోలేదు. కమిటీలో వైస్‌చైర్మన్, డైరెక్టర్ పోస్టులు కూడా నామినేట్ చేయాల్సి ఉంది. వాటికి మాత్రం స్థానిక నేతలకే అవకాశం కల్పిస్తారు. కమిటీలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీకి కూడా అవకాశం ఇస్తారన్న చర్చ కూటమి వర్గాల్లో జరుగుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎవరో?

(5వ పేజీ తరువాయి)

కనబరుస్తున్నారు. ఆలపాటి వర్గీయులు మాత్రం మరింత విశ్వాసంగా గెలుపు తమదేనని ఢంకా బజాయిస్తున్నారు. పోలింగ్ రోజున కూటమి శ్రేణులు రిగ్గింగ్ చేశాయని పీడీఎఫ్ ఆరోపిస్తున్నది. కాగా మొత్తం 3,47,116 మంది ఓటర్లుండగా 2,41,502 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. ఏలూరు జిల్లాలో 73.30, కృష్ణాలో 69.91, ఎన్‌టీఆర్‌లో 65.69, గుంటూరులో 66.45, బాపట్లలో 74.30, పల్నాడులో 77.33 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 483 పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ జరిగింది.

28 టేబుళ్లు.. నిరంతరాయంగా లెక్కింపు

ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితం వెలువడేంత వరకు నిరంతరాయంగా కొనసాగిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఇందుకోసం మూడు షిఫ్టుల్లో 750 మంది సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. పోలింగ్ అయిన ఓట్ల సంఖ్య అధికంగా ఉన్నందున కౌంటింగ్ హాల్‌లో 28 టేబుళ్లని ఏర్పాటు చేశారు. రౌండ్ల వారీగా వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో టేబుల్‌కి పంచి తొలుత తొలి ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 9 నుంచి 10 రౌండ్లలో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది. అప్పటికే ఏ అభ్యర్థికి అయినా 50 శాతం కంటే ఒక్క ఓటు అధికంగా వచ్చినా విజేతగా ప్రకటిస్తారు. లేని పక్షంలో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుని అందరికంటే తక్కువగా ఓట్లు పోలింగ్ అయిన అభ్యర్థి నుంచి ప్రారంభిస్తారు. అలా ఒక్కో అభ్యర్థిని కింది నుంచి తీసేస్తూ కౌంటింగ్ ప్రక్రియని ముందుకు తీసుకెళతారు. ఇలా 50 శాతం ఓట్లు దాటే వరకు కొనసాగించి గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తారు. పోలింగ్ అయిన ఓట్లు అధికంగా ఉన్నందున తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే దాదాపుగా ఫలితం వెలువడే అవకాశం ఉందని అందరూ అంచనా వేస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం రాత్రి ఆమె ఏసీ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ హాల్స్‌లో టేబుల్స్ ఏర్పాటు, ఏజంట్ల సీటింగ్, ఫెన్సింగ్, బ్యాలెట్ పేపర్లను కలిపేందుకు ఏర్పాటు చేసిన డ్రమ్ములు తదితర సామగ్రిని పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. అనంతరం కౌంటింగ్ హాల్లో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. గత నెల 27న పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలోకి తరలించి భద్రపరిచామన్నారు. పోలింగ్ 69.5 శాతం జరిగినందున దాదాపు 2,41,502 ఓట్లు లెక్కించాల్సి ఉందన్నారు. బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్య ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో కౌంటింగ్ సుమారు రెండు నుంచి మూడు రోజులు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమికంగా కౌంటింగ్ మొదటి రౌండ్లో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను సరిచూసుకుని మిక్సింగ్ చేస్తారన్నారు. తదుపరి చెల్లుబాటయ్యే ఓట్లను పరిశీలన చేసి మొదటి ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తామన్నారు. మొదటి ప్రాధాన్య ఓట్లు లెక్కింపు పూర్తి అయ్యే సమయానికి నిర్దేశించిన కోటా ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలుపొందినట్లు ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులు ఎవరికీ నిర్దేశిత కోట ఓట్లు రాకపోతే తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వారికి వచ్చిన తదుపరి ప్రాధాన్య ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు సైతం ఏజెంట్లను మూడు షిఫ్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామన్నారు. కౌంటింగ్ ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని గుర్తింపు కార్డు లేకుండా ఎవర్నీ కౌంటింగ్ ప్రాంతానికి అనుమతించమన్నారు. లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. జేసీ భార్గవతేజ, డీఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మళ్లీ గంటా 35 నిమిషాలు ఆగిన ప్యాసింజర్ రైలు

- ఆగ్రహించిన ప్రయాణికులు
- ఎండకు తట్టుకోలేక ఆటోలు, బస్సులను ఆశ్రయించిన వైనం



డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ప్రయాణికులు

వేమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేమూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం రేపల్లె-గుంటూరు ప్యాసింజర్ రైలు గంట 36 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఉదయం 9.59 నిమిషాలకు రావాల్సిన రైలు 10 గంటలకు వచ్చి సిగ్నల్ ఇవ్వకపోవడంతో స్టేషన్‌లో నిలిచిపోయింది. 11.35 గంటలకు తిరిగి రైలు బయలు దేరింది. గంటా 35 నిమిషాల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆగ్రహించారు. గత సోమవారం కూడా ఇదేవిధంగా ఇదే ప్యాసింజర్ రైలు గంట 22 నిమిషాల పాటు స్టేషన్‌లో ఆగిపోయింది. ఈ సందర్భంలో స్టేషన్ మాస్టర్, ప్రయాణికుల మధ్య వివాదం చోటుచేసుకుంది. తెనాలి-సంగం జాగర్లమూడి స్టేషన్‌లో రైల్వే ట్రాక్ మరమ్మతుల సందర్భంగా రైలు నిలిపి వేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ప్రయాణికులకు స్టేషన్ మాస్టర్‌గానీ లేదా కనీసం మైకు అనౌన్స్‌మెంట్ కూడా చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైలులో కూర్చోలేక, ప్లాట్‌ఫారంపైకి రాలేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. గతవారంలో ఇదే సంఘటనలో ప్రయాణికులు ప్రశ్నించినా, అధికారుల్లో మార్పు రాకపోవడంతో వారి తీరును ఎండగడుతున్నారు. ట్రైన్ ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక చాలామంది వారి ప్రదేశాలకు వెళ్లేందుకు ఆటోలు, బస్సులను ఆశ్రయించారు. ఇకనైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రాక్‌ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఈ మార్గంలో కొన్ని ట్రిపులను నిలిపివేసేలా ఆలోచన చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్

- అదనపు లోడు క్రమబద్ధీకరణకు సదావకాశం
- కిలోవాట్‌కు రూ.2 వేల నుంచి రూ.వెయ్యికి తగ్గింపు
- చెల్లింపులకు జూన్ 30 వరకు అవకాశం

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులకు స్పెషల్ ఆఫర్ ప్రకటించింది. అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు సదావకాశాన్ని కల్పించింది. విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో కంటే ఎక్కువ లోడును వినియోగించుకునే గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే వారికి కిలో వాట్‌కు వెయ్యి వరకు తగ్గింపు కల్పించింది. సాధారణంగా గృహ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో కంటే తరువాత ఇంట్లో ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు పెరిగి అదనపు లోడు పెరుగుతోంది. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధికభారం పడుతోంది. ఫలితంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోతున్న ఘటనలు ఉంటున్నాయి. విద్యుత్ సరఫరాలో లోపాలను అధికమించేందుకు గృహ విద్యుత్ వినియోగదారులే స్వచ్ఛందంగా అదనంగా వినియోగిస్తున్న లోడును క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం కిలో వాట్‌కు రూ.2 వేలు అదనంగా సెక్యూరిటీ డిపాజిట్ చార్జీల కింద రూ.200లు కలిపి కిలో వాట్‌కు రూ.2,200 చెల్లించాలి. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వినియోగదారులకు కిలో వాట్‌కు రూ.వెయ్యి, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 కలిపి రూ. 1,200 చెల్లిస్తే సరిపోతుంది. అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల్లో (ఈఆర్‌వో) లేదా మీ సేవా సెంటర్‌లు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లలో కూడా చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

స్వచ్ఛందంగా అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశం మార్చి 1 నుంచి జూన్ 30 వరకు కల్పించినట్లు గుంటూరు సర్కిల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏవో) పాశం రామిరెడ్డి తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లలో 6,12,294 మంది గృహ విద్యుత్ వినియోగదారులున్నారని తెలిపారు. వారు సంస్థ అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిరావు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చెరుకూరి తిరుపతిరావు, పాల్గొన్న బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా చెరుకూరి తిరుపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక లాలుపురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా పరిశీలకుడు శ్రీనివాసరాజు, ఎన్నికల అధికారి చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికై కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, నాయకులు జమ్ముల శ్యామ్‌కిషోర్, నేరెళ్ల మాధవరావు, కొత్తూరి వెంకటసుబ్బారావు, మకుటం శివ, శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపరాణి తదితరులు తిరుపతిరావును అభినందించారు.

పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలి

- సాయి సాధన చిట్‌ఫండ్ బాధితుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న చేకూరి సాంబశివరావు

నరసరావుపేట టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాయి సాధన చిట్‌ఫండ్ అధినేత పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులను కూడా అరెస్టు చేసి విచారించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేట పట్టణం పాతూరులో చిట్‌ఫండ్ బాధితుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చేకూరి సాంబశివరావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులను అరెస్టు చేసి విచారణ చేస్తే విషయం బయటకు వస్తుందన్నారు. పల్నాడు జిల్లాలో ఎమ్మెల్యేల ద్వారా అసెంబ్లీలో ప్రస్తావిస్తే ప్రభుత్వం దృష్టికి వస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాలని బాధితులు నిర్ణయించారు. యామిని రామారావు మాట్లాడుతూ సిట్ వారు పుల్లారావు కుటుంబ సభ్యులను విచారించాలనీ, దీనివలన బినామి ఆస్తుల వ్యవహారం బయటకు వస్తుందన్నారు. ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, పల్నాడు జిల్లాలో ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భవిష్యత్ కార్యాచరణగా నిర్ణయించామన్నారు. రాధాకృష్ణ మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును బాధితులు కలిసి పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో కడియాల రమేష్‌బాబు, ఈఎం స్వామి, గట్టు సత్యనారాయణ, బాధితులు పాల్గొన్నారు.

పాఠశాలలకు మళ్లీ పూర్వ స్థితి



తెనాలి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలతో భ్రష్టుపట్టిన ప్రాథమిక పాఠశాలలను కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతోంది. జీవో 117 రద్దు చేసి మళ్లీ ప్రాథమిక పాఠశాలలకు జీవం పోసే దిశగా విద్యాశాఖ వ్యవహరిస్తోంది. ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ఎలా ఉండాలనే అంశాన్ని తల్లిదండ్రుల నిర్ణయం మేరకే అమలు చేసే దిశగా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో తరచూ సమావేశాలు నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రాథమిక విద్యా వ్యవస్థను చక్కదిద్దాలని ఆదేశించారు. గత ప్రభుత్వం జీవో 117తో ప్రాథమిక పాఠశాలల 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. దీంతో ఇంటికి దగ్గరగా ఉన్న పాఠశాల దూరం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల వాహనాలు ఎక్కించారు. ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే మిగలడంతో విద్యార్థుల సంఖ్య పదిలోపునకు చేరడం, పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగలడంతో ప్రాథమిక విద్యారంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యా రంగాన్ని చక్కదిద్దేందుకు నడుం కట్టింది.

జీవో 117 రద్దు చేసి..

జీవో 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న ప్రాథమిక విద్యార్థులకు తిరిగి వెనక్కి పంపేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రతి గ్రామంలోనూ ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి ఐదు తరగతి గదులు, ఐదుగురు ఉపాధ్యాయులతో మెరుగైన బోధన అందించాలని భావిస్తోంది. దీంతోపాటు ఏ ఒక్క పాఠశాల మూత పడకుండా ఉండేందుకు ఆయా గ్రామాల్లో 1, 2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలలు, ఐదు తరగతులు ఉండేలా బేసిక్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. అయితే ఈ విధానం కూడా తమకు దగ్గరగా ఉన్న పాఠశాలను దూరం చేస్తుందనే ఆలోచన తల్లిదండ్రుల్లో వ్యక్తం కావడంతో పాఠశాలలో విద్యా కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిదండ్రుల నిర్ణయాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశించింది.

తల్లిదండ్రుల కమిటీల తీర్మానాల మేరకు..

ఈ మేరకు పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు పరిస్థితిని వారి ముందు ఉంచారు. ఎక్కువ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమకు దగ్గరగా ఐదు తరగతులు నుంచే బేసిక్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకే మొగ్గు చూపుతూ తీర్మానాలు చేశారు. ప్రతి మండలంలో కూడా అధిక సంఖ్యలో ఈ విధానం ఏర్పాటుకు తీర్మానాలు చేసి ఆయా మండలాల విద్యాశాఖాధికారులకు అందించారు. ఈ నిర్ణయాలను ప్రతి మండలంలో ఎంఈవోలు రాష్ట్ర విద్యాశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. బేసిక్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు ద్వారా గత పాత విధానాన్ని తిరిగి ప్రాథమిక విద్యా రంగంలో నెలకొంటుంది. దీంతో ప్రతి పాఠశాల పిల్లలకు దగ్గరగా ఉండటమే కాకుండా తగిన సంఖ్యలో విద్యార్థులు, టీచర్లు ఉండే అవకాశం ఉందనీ, ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని పలువురు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రాథమిక విద్యా రంగాన్ని చక్కదిద్దుతున్న కూటమి ప్రభుత్వం నిర్ణయాల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి



మృతుడు బ్రహ్మారెడి (ఫైల్)

చెరుకుపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పొన్నపల్లి గ్రామానికి చెందిన అట్ల బ్రహ్మారెడ్డి, వారే నాగార్జునరెడ్డి అనే యువకులు చెరుకుపల్లి నుంచి పొన్నపల్లి వెళ్తుండగా పొన్నపల్లిలోని మేరీరోజ్‌బడ్స్ స్కూల్ ఎదురుగా అదుపు తప్పిన బైకు డివైడర్‌ను ఢీకొనడంతో బ్రహ్మారెడ్డి మృతి చెందాడు. వారే నాగార్జునరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

ఒంగోలు క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా వినుకొండ మండలం విఠంరాజుపల్లికి చెందిన చేవూరి నాగేంద్రం(85) ఆర్టీసీ బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళుతుండగా బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను స్థానిక రిమ్స్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రేపల్లె నుంచి హైదరాబాద్ వెళ్లే ప్యాసింజర్ రైలులో ఎస్ఎల్ఆర్ బోగిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. ఆదివారం రేపల్లె నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తున్న రైలులో బెల్లంకొండ రైల్వే స్టేషన్‌కు వచ్చేసరికి సదరు బోగిలో వ్యక్తి మృతి చెందినట్టు తోటి ప్రయాణికులు గుర్తించి రైల్వే గార్డుకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న నడికుడి పోలీసు స్టేషన్‌లోని జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీన పరుచుకున్నారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహం పై ఎటువంటి గాయాల్లేవు. అనారోగ్య సమస్యతో మృతి చెందినట్టు ప్రాథమిక సమాచారం. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్‌పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిలుమూరు రైల్వేస్టేషన్ సమీపంలో...

తెనాలి క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలోని చిలుమూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తెల్ల పంచె, తెల్ల చొక్కా ధరించిన 70 సంవత్సరాల వృద్ధుడు ఎదురుగా వస్తున్న రైలును గుర్తించక పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

రేపు బాల బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

బాపట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ ఈనెల 4వ తేదీ బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు 2009 మార్చి 30వ తేదీ తర్వాత పుట్టిన వారు అయి ఉండాలి. ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు తీసుకొని సెలక్షన్‌కు రావాలని ఆయన కోరారు. బాలబాలికలు 55 కిలోల లోపు బరువు ఉండాలన్నారు. మధ్యాహ్నం 2 గంటలు నుంచి సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితిలో పేరలి నరసయ్య తిమ్మరాజు కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్‌కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేత మంతెన సత్యనారాయణరాజు సహకారంతో ఆదివారం బీపీ, షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ 100 మందికి వైద్య పరీక్షలు చేసి నెలకు మందులను ఉచితంగా అందజేశామన్నారు. ఈ క్యాంప్‌నకు వచ్చిన వారందరికి అన్నప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, పెనుమెత్స బాపిరాజు, ఎ.వెంకటేశ్వర్లు, జిడుగు వెంకటేశ్వర్లు, బాజి, బుర్ల బుల్లియ్య, స్వామి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పఠాన్ ఆలీఖాన్

వేమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచన మేరకు పార్టీ అధిష్టానం జంపని గ్రామానికి చెందిన పఠాన్ ఆలీఖాన్‌ను నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన అశోక్‌బాబును ఆదివారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన ఆలీఖాన్‌ను అశోక్‌బాబుతో పాటు జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, మండల కన్వీనర్ దాది సుబ్బారావు, ఇమామ్, హుస్సేన్, షేక్ మస్తా న్‌వలి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతార్లంక సురేష్ అభినందనలు తెలిపారు.

రేపు లైటింగ్, డెకరేషన్, వంట సామానులు, చీరల వేలం

పిట్టలవానిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానం ఆవరణలో ఈనెల 4వ తేదీ ఉదయం 11గంటలకు ఆలయానికి సంబంధించి లైటింగ్, డెకరేషన్, వంటసామాను సప్లై చేయుటకు, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు సేకరించు హక్కులకు బహిరంగ వేలం పాట జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. లీజుల, లైసెన్స్‌ల హక్కుల కొరకు వేలంపాట జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చునని ఆయన చెప్పారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునని, సంవత్సరం పాట మొత్తం ముందుగానే చెల్లించాలని, ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ఐడి : crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: నం.1) మెసర్స్ శ్రీనివాస యార్న్ ట్రేడర్స్, నం. 35/175, సాధనవారి పాలెం, జంధ్ర పేట, ప్రకాశం - 523165 నం.2) శ్రీ పద్మనాభుని వీరవెంకట శ్రీనివాసరావు, తండ్రి సత్యనారాయణ, నం.35,175 దేవాంగపురి, చీరాల నగర్, జంధ్ర పేట, ప్రకాశం - 523165. నం.3) శ్రీమతి పద్మనాభుని శ్రీదేవి, భర్త వీర వెంకట శ్రీనివాసరావు, నం.35,175 దేవాంగపురి, చీరాల నగర్, జంధ్ర పేట, ప్రకాశం - 523165. నం.4) శ్రీమతి జలది వీరరాఘవమ్మ, భర్త నర్సింహారావు, డోర్ నం.: 14/19/136/2, శ్రీ వైష్ణవి ఎవెన్యూ - 407, పాలిమేర రోడ్, చీరాల - 523155, నం.5) మెసర్స్ జయశ్రీ హ్యాండ్‌లూమ్ ఫ్యాబ్రిక్స్, షాప్ నం.7, వైష్ణవి ఎవెన్యూ, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్ - 523155, నం.6) శ్రీ జలది అయ్యప్ప, తండ్రి వెంకటేశ్వర్లు, ఫ్లాట్ నం.407, వైష్ణవి ఎవెన్యూ, పాలిమేర రోడ్, మహిళా మండలి సమీపాన చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్ - 523155 వారి ద్వారా బ్యాంక్‌కు రావలసిన 25.02.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలతో కలిపి 24.02.2025 నాటికి రూ.34,26,483/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల ఇరవై ఆరు వేల నాలుగు వందల ఎనభై మూడు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

గమనిక: 13.50% ఆర్ఓఐ వంతున రూ.10,00,000 మొత్తాన్ని రుణంగా హామీదారులుగా ఉన్నట్టి మీలోని నం.4 మరియు సహబాధ్యతాదారులుగా ఉన్నట్టి మీలోని నం.2 & 6 కొరకు భాగస్వాములుగా మీలోని నం.2 & 6 ద్వారా ప్రాతినిధ్యం వహించు నం.5 అయిన మీ అభ్యర్థన మేర ఆర్థిక సహాయం (SECURED OD WITHOUT DP: 512120020008132) తేది: 30.03.2016న కూడా మా 329-చీరాల శాఖ వారు అందచేసారు మరియు 24.02.2025 నాటికి మిగులు బకాయి రూ.10,88,790/-

ఆస్తుల యొక్క షెడ్యూల్
మా బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తులు
(శ్రీమతి జలది వీరరాఘవమ్మ భర్త నర్సింహారావుకు చెందిన ఆస్తులు)

చీరాల, ఆర్ఆర్ రోడ్, వాల్యుయేషన్ వార్డు నం.11-5, ప్రస్తుత వార్డు నం.14, పాత వార్డు నం.4లో పాలిమేర రోడ్, ఆర్.ఎస్.నం.269-5 భాగం, చీరాల పురపాలక సంఘ, టిఎస్ నం.172 డోర్ నం.14-19-134 చీరాల సబ్ జిల్లా, ప్రకాశం జిల్లా వద్ద గల వాణిజ్య భూమి మరియు భవన ఆస్తి యావత్తు. ఐటం నం.1: 128 చ.గజాల విస్తీర్ణ స్థలంలో 1170 చ.అ. ఆర్‌సిసి పైకప్పు భవనం సరిహద్దులు: తూర్పు: ఐటమ్ నం.2- 19 అడుగులు, దక్షిణం: గ్రాంధి తులసమ్మ వగైరా, ఉమ్మడి సరిహద్దు రాయి నుండి కొంత విస్తీర్ణం మెరక వైపు స్థలం - 59 అడుగులు, పశ్చిమం: సర్కారు బజార్ - 19 అడుగులు, ఉత్తరం: ఐటం నం.2- 62.02 అడుగులు. ఐటం నం.2: ఉమ్మడి మార్గం 10 చ.గజాలలో 2 గజాల అవిభాజ్య వాటా మొత్తం 130 చ.గజాల స్థలం. సరిహద్దులు: తూర్పు: మద్ది సీతమ్మ అనగా నాగమణిల స్థలం, దక్షిణం: బుర్ల బురకమ్మాస్ టాయిలెట్, పశ్చిమం: బుర్ల గరటమ్మా గోడ మరియు గ్రంధి తులసమ్మాస్ గోడ కొంత విస్తీర్ణం మరియు ఐటం నం.1 కొంత విస్తీర్ణం, మళ్ళీ దక్షిణం: ఐటం నం.1 స్థలం, మళ్ళీ పశ్చిమం: సర్కారు బజార్, ఉత్తరం: మద్ది సీతమ్మ అనగా నాగమణిల స్థలం.

రిజర్వు ధర: రూ.1,41,00,000/-
(రూపాయలు ఒక కోటి నలభై ఒక్క లక్షలు మాత్రమే)

వేలం వివరాలు	
టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
09-04-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, నం.14-21-85, ధర్మన్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం - 523155,. టెలిఫోన్ నం.08594-238883, సెల్ నం.9397081234

టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, నం.14-21-85, ధర్మన్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం - 523155, వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకు తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08594-238883, సెల్ నం.9397081234లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తితో అమ్మకం సంప్రదింపుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకోనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెటును అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి [illegible] ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 01.03.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

జాతీయ జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గానికి రూ.10.54 కోట్లు కేటాయింపు

- ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్ల తాగునీరు అందజేత
- సమస్యాత్మక గ్రామాల్లో టెండర్లకు ఆదేశాలు
- ఎమ్మెల్యే ఆనందబాబు


ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయ్‌కుమార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జలజీవన్ మిషన్ పథకం ద్వారా వేమూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.10 కోట్ల 54 లక్షల 77 వేల నిధులు కేంద్ర ప్రభుత్వం ద్వారా కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిన నిధుల కేటాయింపు వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయ్‌కుమార్ ఆదివారం ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో తాగునీటి సౌకర్యానికి సంబంధించి సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి అధికారుల ద్వారా అంచనాలతో కూడిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. రూ.13 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపగా కేంద్ర ప్రభుత్వం రూ.10 కోట్ల 54 లక్షల 77 వేలను మంజూరు చేసిందన్నారు. ప్రతి మనిషికి గతంలో రోజుకు 40 లీటర్ల తాగునీటిని సరఫరా చేయడం జరిగిందని ఇకపై రోజుకు 55 లీటర్లు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో తక్షణ చర్యల కోసం అధికారులను ఆదేశించామన్నారు. అమృతలూరు మండలానికి రూ.5 కోట్ల 61 లక్షల 30 వేలు, భట్టిప్రోలు మండలానికి ఒక కోటి 37 లక్షలు, కొల్లూరు మండలానికి రూ.15 లక్షల 89 వేలు, చుండూరు మండలానికి ఒక కోటి 23 లక్షల 80 వేలు, వేమూరు మండలానికి రూ.2 కోట్ల 16 లక్షల 78 వేలు కేటాయించడం జరిగిందన్నారు. సంబంధించిన పనులకు త్వరలో టెండర్లు పిలిచి వేసవి మొదలయ్యే లోపుగాని పనులు ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

వాటర్ గ్రిడ్ ద్వారా కృష్ణా జలాలు...

నియోజకవర్గంలో వాటర్ గ్రిడ్ ద్వారా కృష్ణా జలాలను నియోజకవర్గంలోనే ప్రజలకు అందించేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సంబంధించి అంచనాలతో కూడిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. ఐదు మండలాల పరిధిలో ఒక్కొక్క మండలాన్ని రెండు జోన్లుగా విభజించి ఆయా జోన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు కృష్ణా జలాలను సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రక్రియకు ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కృష్ణానది నుంచి జలాలను సరఫరా చేసుకునేందుకు కొల్లూరు మండలం చిలుమూరు వద్ద ప్రత్యేకంగా గ్రిడ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. దీని వల్ల భవిష్యత్‌లో నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉండదని తెలిపారు.

ప్రజలందరిపై భావదేవుని ఆశీస్సులు ఉండాలి

- ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


భావదేవునికి పూజలు చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు

బాపట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరిపై భావదేవుని ఆశీస్సులు నిండుగా ఉండాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. ఆయన ఆదివారం శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. భావదేవుని దర్శించుకొని ఆయన ఆశీస్సులతో ఇప్పటికే బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతిసారి బావదేవుని దర్శించుకొని అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీమా లీలాకృష్ణ, ఏడుకొండలు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రీబగళాముఖిని దర్శించిన కర్ణాటక రిటైర్డ్ జడ్జి విశ్వనాథ్


రిటైర్డ్ జడ్జి విశ్వనాథ్ దంపతులను సత్కరిస్తున్న శ్రీనివాసరావు, అర్చకులు

పిట్టలవానిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని కర్ణాటక రాష్ట్ర రిటైర్డ్ సిటీ ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి ఎ.విశ్వనాథ్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తొలుత ప్రొటోకాల్ ప్రకారం బాపట్ల కోర్టు అధికారులు, రెవెన్యూ అధికారులు, చందోలు పోలీసు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది వారికి ఘనస్వాగతం పలికారు. దేవస్థానం సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రదక్షణలు చేయించి అఖండ జ్యోతి దీపారాధన జరిపి శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ సీనియర్ సహాయకుడు కె.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది రిటైర్డు జడ్జి విశ్వనాథ్ దంపతులను దుశ్శాలువాలతో సత్కరించి ఆలయ చరిత్ర గురించి వివరించారు. అమ్మవారి చిత్రపటం అందజేశారు.

భావదేవుని ఆలయ సందర్శన

బాపట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలోని చారిత్రాత్మక ప్రసిద్ధిగాంచిన భావదేవుని ఆలయాన్ని కర్ణాటకకు చెందిన రిటైర్డ్ జడ్జి విశ్వనాథ్ దంపతులు ఆదివారం సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు ఘన స్వాగతం పలికారు. భావదేవుని ఆలయ ప్రాశస్త్యం ఎంతో గొప్పగా ఉందని ఆయన అన్నారు. ఆలయంలోని పలు చారిత్రాత్మక కట్టడాలు, ఆలయ చరిత్ర గురించి అర్చకులు గోపీకృష్ణ, భార్గవ్‌లు రిటైర్డ్ జడ్జి విశ్వనాథ్‌కు తెలియజేశారు.

పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో మార్పులపై సభ్యులతో చర్చ

- సీనియర్ బీఎంఎస్ నాయకుడు డీఎల్ కాంతారావు


డీఎల్ కాంతారావును సన్మానిస్తున్న సభ్యులు

కర్లపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న మార్పులు గురించి సభ్యులతో సీనియర్ బీఎంఎస్ నాయకుడు డీఎల్ కాంతారావు చర్చించారు. కర్లపాలెం పోస్టాఫీస్, బీఎంఎస్ యూనియన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం కర్లపాలెం ఎస్‌వోలో బీఎంఎస్ యూనియన్ ప్రాంతీయ సమావేశం నిర్వహిచారు. రానున్న రోజుల్లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న మార్పులు, ఉద్యోగులు పడే ఇబ్బందుల గురించి నరేంద్ర, నాగరాజు, కృష్ణయ్య, పోతురాజు, పవన్ ప్రసంగించారు. అనంతరం డీఎల్ కాంతరావును పోస్టల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఆశాబి, పద్మారావు, కర్లపాలెం పోస్టల్ సిబ్బంది పర్యవేక్షించారు.

అంకెల గారడికే పరిమితమైన రాష్ట్ర బడ్జెట్

- మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రబడ్జెట్ అంకెల గారడికి నిదర్శనంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసానికి గురిచేస్తున్నారని అన్నారు. 9 నెలల పాలనలో ప్రజలు విసుగు చెందారన్నారు. వైసీపీ వారికి ప్రభుత్వ పథకాలు ఇవ్వనప్పుడు పన్నులు ఎందుకు చెల్లించాలని కోన ప్రశ్నించారు? ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటంలేదని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయటంలో విఫలమయ్యారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జిల్లా యువజన అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎస్సీ సెల్ నాయకులు జోగి రాజా, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, నామన చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన ఎంపీ

బాపట్ల రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఎంపీ లోకసభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా బాపట్ల మండలం బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

యోగాతో మానసిక ఉత్తేజం

వేమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : యోగా ద్వారా మానసిక ఉత్తేజం కలుగుతుందని, అదేవిధంగా ఏకాగ్రతపై దృష్టి సారించవచ్చని వేమూరు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వేమూరు బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు యోగా నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ఆటపాటల్లో కూడా రాణించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హాస్టల్ విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న ఎస్ఐ రవికృష్ణ

శ్రీరామా రూరల్‌విద్యా సంస్థలో...

కొల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామా రూరల్ అకాడమీ విద్యార్థినులకు యోగా, మెడిటేషన్ తరగతులను ఎస్ఐ ఏడుకొండలు నిర్వహించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలలో భాగంగా చిలుమూరు శ్రీరామా రూరల్ విద్యా సంస్థలో కళాశాల విద్యార్థినులకు మెడిటేషన్, యోగాకు సంబంధించి తరగతులు నిర్వహించారు. మహిళల హక్కులను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీరామా రూరల్ అకాడమీలోని విద్యార్థినులకు యోగా క్లాసులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఏడుకొండలు

సీఎం ప్రకటనతో ఆనందంలో ఆశా వర్కర్లు

- కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

వేమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలం నుంచి తమ ప్రయోజనాల అమలు కోసం ఎదురు చూస్తున్న ఆశా వర్కర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన వరాలతో ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఆశా వర్కర్‌కు రిటైర్ అయిన తరువాత గ్రాట్యూటీ అమలు చేయడంతో పాటు పదవి విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంపుదల చేయడంపై హర్షం వ్యక్తపరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఆశా వర్కర్లకు దేశంలోనే మొట్టమొదటిసారిగా గ్రాట్యూటీ అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.10 వేల జీతంతో పాటు ప్రసూతి సెలవుల కాలంలో వేతనాలు అందిస్తామని, మరికొన్ని ప్రయోజనాలను సమకూర్చేందుకు చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నారంటూ ఆయనకు నీరాజనాలు పడుతున్నారు.

చిత్తశుద్ధికి నిదర్శనం : సుమతి



కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనంగా ముఖ్యమంత్రి తమ ప్రయోజనాల కోసం గ్రాట్యూటీని అమలు చేసే విధానాన్ని ప్రకటించారని, పదవి విరమణ వయసు కూడా పెంచడం ఎంతో ప్రయోజనకరమని జంపని గ్రామానికి చెందిన ఆశా వర్కర్ పందిపాటి సుమతి అన్నారు.

గత ప్రభుత్వం విస్మరించింది : సుజాత



గత ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంపై ఎన్ని ఉద్యమాలు చేపట్టిన ప్రయోజనం లేకపోయిందని తమను పూర్తిగా విస్మరించిందని కుచ్చెళ్లపాడుకు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ రామటంకు సుజాత అన్నారు. కూటమి ప్రభుత్వం తాము చేస్తున్న సేవలను గుర్తించి అనేక ప్రయోజనాలను ప్రకటించడం ద్వారా తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, ఇందుకు ముఖ్యమంత్రికి తాము ఎంతో రుణపడి ఉంటామన్నారు.

వైసీపీ పాపాల పుట్టబద్దలు : కొల్లా

బాపట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాపాల పుట్టబద్దలై నేరాల చిట్టా బట్టబయలు కావటం హర్షణీయమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఆదేశాలు, సందేశాల ప్రోత్సాహంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబును, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తోపాటు వారి కుటుంబం సభ్యులను దూషించానని పోసాని కృష్ణమురళి తన నేర అంగీకార వాంగ్మూలంలో పశ్చాతాపం ప్రకటించటం అభినందనీయమన్నారు. ఇతర వైసీపీ నేతలు కూడా తాము చేసిన అనైతిక ఆరాచక చర్యలకు, తప్పుడు ప్రచారాలకు స్వచ్ఛందంగా నేర అంగీకార వాంగ్మూలాలు ఇచ్చి పాప ప్రక్షాళనకు పూనుకుంటే ప్రజలు కొంత వరకైన క్షమిస్తారని కొల్లా వీరయ్య చౌదరి అన్నారు.

పేదల కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలి : మేకల

బాపట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమెక్రసి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో మేకల ప్రసాద్ మాట్లాడుతూ వెదుళ్ళపల్లి పంచాయతీ కొల్లా వెంకయ్యకాలనీ, కర్లపాలెంరోడ్డులోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు పూరిపాకలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. మురికివాడలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలన్నారు. పాలకులు స్పందించి ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామిక వాదులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ప్రగతిశీల యువజన సంఘం నాయకులు టి.వెంకన్నబాబు, వి.రవి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, షేక్ సుభానీ, వి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారి అభివృద్ధి పనులు

- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అమృతలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు రహదారి అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. మండల పరిధిలోని కూచిపూడి-అమృతలూరు గ్రామాల మధ్య రహదారి గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాటు, అభివృద్ధి కూడా జరగకపోవడంతో రోడ్డు గుంతలు పడి నానా ఇబ్బందులుపడ్డారు. దీంతో సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించారు. వెంటనే ప్రభుత్వం టెండర్ పిలవడంతో టెండరు ఖరారు అయిన సదరు గుత్తేదారు పనులు ప్రారంభించారు. రహదారిపై కంకరు, డస్ట్ వేయడంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.


అభివృద్ధి చేస్తున్న రహదారి

టైపు పరీక్షలకు 39 మంది విద్యార్థుల హాజరు


పాలిటెక్నిక్ కళాశాలలో టైప్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

రేపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో టైప రైటింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నికల్ కళాశాలలో ఆదివారం ఇంగ్లీషు లోయర్ గ్రేడ్, ఇంగ్లీషు హయ్యర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైప్ రైటింగ్ పరీక్షలలో మొత్తం 40 మంది విద్యార్థులకు గాను 39 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వీరిలో ఇంగ్లీషు లోయర్ గ్రేడ్ 21 మందికి గాను 20 మంది హాజరయ్యారు. ఇంగ్లీషు హయ్యర్ గ్రేడ్‌కు 15 మంది, తెలుగు లోయర్ గ్రేడ్‌కు ఒక్కరు, తెలుగు హయ్యర్ గ్రేడ్‌కు ముగ్గురు హాజరయ్యారని అన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించటం జరిగిందన్నారు.

లక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


పూజాది కార్యక్రమాలు చేస్తున్న శ్రీధర్ దంపతులు

కొల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి దాతలు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన కొల్లూరు నాగశ్రీధర్ దంపతులు సమీప గ్రామం చిలుమూరులోని ఉభయ రామలింగేశ్వర క్షేత్రానికి ఎదురుగా లక్ష్మీగణపతి దేవాలయం నిర్మించేందుకు పూనుకుని ఆదివారం శంకుస్థాపన సందర్భంగా అర్చకులతో విశేష పూజలు చేశారు. అనంతరం శిలను ప్రతిష్ఠించి దీపారాధనలు చేశారు. అర్చకులు ఆలయ నిర్మాణం నిర్విఘ్నంగా జరగాలని కోరుతూ పూజాది కార్యక్రమాలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్గనైజర్లను అభినందించిన ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశేష కృషి చేసిన ఆర్గనైజర్లను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అభినందించారు. భట్టిప్రోలు మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఓటింగ్‌లో విశేష కృషి చేసిన వారందరికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేసి ఇదే స్ఫూర్తి భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని సూచించారు.


ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్గనైజర్లతో ఎమ్మెల్యే ఆనందబాబు

విద్యార్థులకు పరీక్ష కిట్‌లు అందజేత


విద్యార్థులకు పరీక్ష కిట్‌లు అందిస్తున్న చర్చి ప్రతినిధులు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష కిట్‌లను చర్చి ప్రతినిధులు అందించారు. స్థానిక లూథరన్ చర్చిలో జరిగిన ఆరాధన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవసరమైన పరీక్ష కిట్‌లను కసుకుర్తి రజని, ఆమె కుటుంబ సభ్యులు అందజేశారు. మంచి ఉత్తీర్ణతతో విద్యార్థులు పరీక్షలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పాస్టర్ రవీంద్ర వర్మ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల ద్వారా అభ్యసించిన పాఠాలను పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు సమాధానాలుగా రాసి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

ఇంటింటికీ కొళాయి

» జలజీవన్ మిషన్ కింద గ్రామాలకు ప్రత్యేక నిధులు విడుదల
» ఎమ్మెల్యే ఏలూరి
» సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



పర్చూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం కింద పర్చూరు నియోజకవర్గంలోని 81 పనులకు రూ.36.55 కోట్లు మంజూరైనట్లు ఆదివా రం ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో రక్షిత తాగునీటి సరఫరా, ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, పైపు లైన్ నిర్మాణం, ఇంటింటికీ కొళాయి ఏర్పాటు తదితర పనులకు ఈ నిధులను వినియోగించనున్నట్లు వివరించారు. సీఎం చంద్రబాబు సహకారంతో కోట్లాది రూపాయల నిధులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చిన్నగం జాం మండలానికి 27 వర్కులకు రూ.8.19 కోట్లు, మార్టూరు మండలానికి నాలుగు వర్కులకు రూ.2.30కోట్లు, ఇంకొల్లు మండలానికి 15 వర్కులకు రూ.4.21కోట్లు, కారంచేడు మండలానికి 16 వర్కులకు రూ.9.68కోట్లు, పర్చూరు మండలానికి 13 పనులకు గాను రూ.7.34కోట్లు, యద్దనపూడి మండలానికి 6 వర్కులకు రూ.4.84కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గత వైసీపీ హయాంలో తాగునీటి ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు కూడా నోచుకోలేదన్నారు. దీంతో కలుషిత నీటిని ప్రజలు తాగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన లో జలజీవన్ మిషన్‌కు జీవం లేకుండా చేశారన్నారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆ ప్రకటనలో ఏలూరి స్పష్టం చేశారు.

చెన్నుపల్లి-వైదన రోడ్డు అభివృద్ధి

» మంత్రి గొట్టిపాటి కృషితో రూ.3 కోట్ల నిధులు
» శరవేగంగా పనులు పూర్తి చేస్తామంటున్న కాంట్రాక్టర్లు


చెన్నుపల్లి-వైదన రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఎక్స్‌కవేటర్


ఆక్రమణలతో కుంచించుకుపోయిన తారు రోడ్డు

బల్లికురవ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న చెన్నుపల్లి వైదన గ్రామాల పంచాయతీ రాజ్ రోడ్డు అభివృద్ధి పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో ఉపాధి హామీ పథకం నిధులు రూ.3కోట్లు మంజూరయ్యాయి. చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, వైదన గ్రా మాల మధ్య ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని మోకాటిలోతు గోతులు ఏర్పాడ్డాయి. ఈ రోడ్డును గత వైసీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాల ప్రజలు రోడ్డు సమస్యలను మంత్రి రవికుమార్‌కు వివరించారు. మంత్రి వెంటనే నిధులు మంజూరు చేయించారు. స్నేహ కనస్ట్రక్షన్ కంపెనీ పనులను దక్కించుకున్నారు. మొత్తం ఈ రోడ్డు మార్జిన్ మట్టితో సహా ఏడున్నర మీటర్ల వెడల్పుతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో కొందరు రైతులు రోడ్డును ఆక్రమించుకున్నారని వారి సమక్షంలో రోడ్డును వెడల్పు చేసి శరవేగంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంపై ప్రజలు మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపారు.


నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సాహితీమిత్ర మండలి సభ్యులు

మధ్యతరగతి ప్రజల జీవనమంతా ఊహాలోకమే

కవి నాగేశ్వరరావు

అద్దంకి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మధ్య తరగతి ప్రజల జీవనమంతా ఊహా లోకమే అని ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు అన్నారు. సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం బంగ్లా రోడ్డులో ఉన్న చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో గుంటూరుకు చెందిన ప్రముఖ కవి, రిటైర్డ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి పెనుమాక నాగేశ్వరరావును ఘనంగా సత్కరించి సాహిత్య రత్న బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజల జీవనం ఆధారంగా నాగేశ్వరరావు రచనలు సాగాయన్నారు. నాగేశ్వరరావు రాసిన నాన్న నువ్వు సున్ననా, ఫారిన్ సెంటు, బార్ తం, వైతరణి, తోమింట ఒకటి, ఆలయం, దేవుడి పాట తదితర రచనల గురించి పాలపర్తి జ్యోతిష్మతి, కుందుర్తి స్వరాజ్యపద్మజ లు వివరించారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ యు, దేవపాలన, జ్యోతి చం ద్రమౌళి, లేవిప్రసాద్, ఆర్వీ రాఘవరావు, చందలూరి నారాయణరావు, పీసీహెచ్ కోటయ్య, సాంబశివరావు, చప్పిడి వీరయ్య, ఎల్.శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు పాల్గొన్నారు.

14 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 14 బస్తాల రేషన్ బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీత ఆదివారం పట్టుకున్నారు. ఈ ఘటన ఆదివారం ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అక్రమార్కులు ఒక వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ఐడి : crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారులు: నం.1) మెసర్స్ శ్రీనివాస యార్న్ ట్రేడర్స్, నం. 35/175, సోమవారి పాలెం, జంధ్ర పేట, ప్రకాశం - 523165 నం.2) శ్రీ పద్మనాభుని వీరవెంకట శ్రీనివాసరావు, తండ్రి సత్యనారాయణ, నం.35,175 దేవాంగపురి, చీరాల నగర్, జంధ్ర పేట, ప్రకాశం - 523165. నం.3) శ్రీమతి పద్మనాభుని శ్రీదేవి, భర్త వీర వెంకట శ్రీనివాసరావు, నం.35,175 దేవాంగపురి, చీరాల నగర్, జంధ్ర పేట, ప్రకాశం - 523165. నం.4) శ్రీమతి జలది వీరరాఘవమ్మ, భర్త నర్సింహరావు, డోర్ నం.: 14/19/136/2, శ్రీ వైష్ణవి ఎవెన్యూ - 407, పొలిమేర రోడ్, చీరాల - 523155, నం.5) మెసర్స్ జయశ్రీ హ్యాండ్‌లూమ్ ఫ్యాబ్రిక్స్, షాప్ నం.7, వైష్ణవి ఎవెన్యూ, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్ - 523155, నం.6) శ్రీ జలది అయ్యప్ప, తండ్రి వెంకటేశ్వర్లు, ఫ్లాట్ నం.407, వైష్ణవి ఎవెన్యూ, పొలిమేర రోడ్, మహిళా మండలి సమీపాన చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్ - 523155 వారి ద్వారా బ్యాంక్‌కు రావలసిన 25.02.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలతో కలిపి 24.02.2025 నాటికి రూ.34,26,483/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల ఇరవై ఆరు వేల నాలుగు వందల ఎనభై మూడు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

గమనిక: 13.50% ఆర్ఓఐ వంతున రూ.10,00,000 మొత్తాన్ని ఋణంగా హామీదారులుగా ఉన్నట్టి మీలోని నం.4 మరియు సహబాధ్యతాదారులుగా ఉన్నట్టి మీలోని నం.2 & 6 కొరకు భాగస్వాములుగా మీలోని నం.2 & 6 ద్వారా ప్రాతినిధ్యం వహించు నం.5 అయిన మీ అభ్యర్థన మేర ఆర్థిక సహాయం (SECURED OD WITHOUT DP: 512120020008132) తేది: 30.03.2016న కూడా మా 329-చీరాల శాఖ వారు అందచేసారు మరియు 24.02.2025 నాటికి మిగులు బకాయి రూ.10,88,790/-

ఆస్తుల యొక్క షెడ్యూల్
మా బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తులు
(శ్రీమతి జలది వీరరాఘవమ్మ భర్త నర్సింహరావుకు చెందిన ఆస్తులు)

చీరాల, ఆర్ఆర్ రోడ్, వాల్యుయేషన్ వార్డు నం.11-5, ప్రస్తుత వార్డు నం.14, పాత వార్డు నం.4లో పొలిమేర రోడ్, ఆర్.ఎస్.నం.269-5 భాగం, చీరాల పురపాలక సంఘం, టీఎస్ నం.172 డోర్ నం.14-19-134 చీరాల సబ్ జిల్లా, ప్రకాశం జిల్లా వద్ద గల వాణిజ్య భూమి మరియు భవన ఆస్తి యావత్తు. ఐటం నం.1: 128 చ.గజాల విస్తీర్ణ స్థలంలో 1170 చ.అ. ఆర్‌సిసి పైకప్పు భవనం సరిహద్దులు: తూర్పు: ఐటమ్ నం.2- 19 అడుగులు, దక్షిణం: గ్రాంది తులసమ్మ వగైరా, ఉమ్మడి సరిహద్దు రాయి నుండి కొంత విస్తీర్ణం వెనుక వైపు స్థలం - 59 అడుగులు, పశ్చిమం: సర్కారు బజార్ - 19 అడుగులు,ఉత్తరం: ఐటం నం.2- 62.02 అడుగులు. ఐటం నం.2: ఉమ్మడి మార్గం 10 చ.గజాలలో 2 గజాల అవిభాజ్య వాటా మొత్తం 130 చ.గజాల స్థలం. సరిహద్దులు: తూర్పు: మద్ది సీతమ్మ అనగా నాగమణిల స్థలం, దక్షిణం: బుర్ల బురకమ్మాస్ టాయిలెట్, పశ్చిమం: బుర్ల గరటమ్మా గోడ మరియు గ్రంది తులసమ్మాస్ గోడ కొంత విస్తీర్ణం మరియు ఐటం నం.1 కొంత విస్తీర్ణం, మళ్ళీ దక్షిణం: ఐటం నం.1 స్థలం, మళ్ళీ పశ్చిమం: సర్కారు బజార్, ఉత్తరం: మద్ది సీతమ్మ అనగా నాగమణిల స్థలం.

రిజర్వు ధర: రూ.1,41,00,000/-
(రూపాయలు ఒక కోటి నలభై ఒక్క లక్షలు మాత్రమే)

వేలం వివరాలు

టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
09-04-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, నం.14-21-85, ధర్మప్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం - 523155,. టెలిఫోన్ నం.08594-238883, సెల్ నం.9397081234

టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల శాఖ, నం.14-21-85, ధర్మప్ రోడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, చీరాల, ప్రకాశం - 523155, వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08594-238883, సెల్ నం.9397081234లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెటును అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 01.03.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

ఆశ్రమాలకు తోడ్పాటు అందిస్తాం

» ఘనంగా చీరాలలో ఎంపీ కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలు
» వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ


చిన్నారికి కేక్‌ను తినిపిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని ఆశ్రమాలను చూసి మనసు చలించిందని, కచ్చితంగా ఆశ్రమాలకు తోట్పాటును అందిస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలు చీరాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ చీరాల దండుబాట రోడ్డులోని కోటయ్య ఆశ్రమంలోని వృద్ధు లు, చిన్నారులు, అలాగే సాల్మన్ సెంటర్‌లోని ఊటుకూరి వెంకట సుబ్బమ్మ వెల్ఫేర్ సొసైటీ, పాండురంగా వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు నిర్వహించా రు. వృద్ధులు, చిన్నారులతో సుదీర్ఘంగా మాట్లాడి ఉత్సాహ పరిచారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేక్ కటింగ్ నిర్వహించి అందరికీ పంచిపెట్టారు. అలాగే అందరికీ నూతన వస్త్రాలు పంపిణీ చేశా రు. అన్నదానం నిర్వహించారు. ప్రభు త్వం నుంచి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. అలాగే మండల పరిధిలోని గవినివారిపాలెం గవిని మణికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఎంపీ వెంట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్, పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న శింగరకొండ తిరునాళ్లకు ట్రాఫిక్ మళ్లింపు

అద్దంకి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ మళ్లించనున్నట్లు చీరాల డీఎస్పీ మొయిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు అద్దంకి, శింగరకొండ వైపు వచ్చు భారీ వాహనాలు, లారీలు, కార్ల ను ట్రాఫిక్ మళ్లించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనాలను సంతమాగులూరు అడ్డరోడ్డు, నర్సరావుపేట, చిలకలూరిపేట, మేదరమెట్ల మీదుగా ఒంగోలు వైపు, రేణింగవరం నుంచి అద్దంకి మీదుగా దర్శి వెళ్లే వాహనాలను మేదరమెట్ల, వెల్లంపల్లి మీదుగా, ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల, మార్టూరు, చిలకలూరిపేట మీదుగా మళ్లించడం జరుగుతుందన్నారు. దర్శి వైపు నుంచి అద్దంకి మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కురిచేడు, వినుకొండ మీదుగా మళ్లించడం జరుగుతుందన్నారు. తిరునాళ్ల సందర్భంగా కట్టెల ట్రాక్టర్‌లు, గడ్డి ట్రాక్టర్‌లు, పొట్టు ట్రాక్టర్‌లకు ప్రవేశం లేదని తెలిపారు. తిరునాళ్ల వైపునకు ఆర్టీసీ బస్సులు, అంబులెన్స్‌లను మాత్రమే అనుమతించడం జరుగుతుందనన్నారు.



నీటి కోసం కోతి పాట్లు

శింగరకొండలో కోతులు వందల సంఖ్యలోనే ఉంటాయి. భక్తుల చేతిలో ఏమి కనిపిస్తే అవి లాక్కెల్తాయి. ఈ క్రమంలో అద్దంకి మండలం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఓ పిల్ల కోతికి దాహం వేసి భక్తుడి చేతిలో ఉన్న వాటర్ బాటిల్‌వైపు చూసింది. గమనించిన భక్తుడు తన వద్ద ఉన్న వాటర్ బాటిల్‌ను ఇచ్చాడు. దీంతో ఆ బాటిల్‌లో నీరు తాగేందుకు అష్టకష్టాలు పడింది. ఎలాగోలా బాటిల్‌ను అటుఇటు తిప్పి కిందాపైనా పోసుకుంటా చివరకు బాటిల్ కిందపడి తర్వాత నేలపైన దొర్లిన నీటితో దాహం తీర్చుకుంది.

- ఆంధ్రజ్యోతి, అద్దంకి

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవం


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠపురం బాల సాయినగర్‌లో ఆదివారం ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మహాన్నవనం, గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసం, నేత్ర ఉన్నీలనం, ధేను, కుంభ, జ్వాలా దర్శనం, పూర్ణాహుతి, శాంతి కల్యాణాన్ని (సీతారామకల్యాణం) జరిపించారు. ఈక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

చిదంబరేశ్వరుడిని తాకిన ఆదిత్యుని కిరణాలు


చిదంబరేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

చినగంజాం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి లింగాకారానికి ఆదివారం సూర్యోదయం వేళ కొన్ని నిమిషాల పాటు భానుని లేలేత కిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి అప్పారావు మాట్లాడుతూ కార్తీక మాసం, శివుని పుట్టిన రోజు, మార్చి మొదటి వారంలో ఆదిత్యుని కిరణాలు స్వామి వారిని అభిషేకిస్తూ ఉంటాయని తెలిపారు. ఆదివారం ఉదయం 7.38 గంటల నుంచి ఐదు నిమిషాల పాటు స్వామి వారి లింగాకారానికి భానుడి కిరణాలు తాకినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యకిరణాలు స్వామి వారిని అభిషేకించే దృశ్యాన్ని భక్తులు తిలకించి పులకించారు.

యోగా, ధ్యానంతో మానసిక వికాసం


ముప్పవరం బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న పీడీ శేషగిరి

పంగులూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శారీరక, మానసిక వికాసానికి యోగా, ధ్యానం ఎంతో దోహద పడతాయని ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల పీడీ రాయిణి శేషగిరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం రేణంగివరం పోలీసులు ముప్పవరం ప్రభుత్వ బాలికల వసతి గృ హంలో విద్యార్థినులకు యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. యోగా కూడా క్రీడలలో భాగమని, పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలకు యోగాపై ఆసక్తి చూపాలని పీడీ సూచించారు. విద్య, క్రీడా రంగాలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని బాలికలు ఉన్నతంగా ఎదగాలని వార్డెన్ పద్మావతి కోరారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు, వైద్యులు

కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

145 మందికి పరీక్షలు

అద్దంకి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం మండపం వద్ద ఒంగోలు యామిని కంటి వైద్యశాల వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 145 మందికి డాక్టర్ ప్రత్తిపాటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి 40 మందికి చికిత్సలు అవసరమని గుర్తించారు. చికిత్సలు అవసరంలేని వారికి ఉచితంగా మందులు, డ్రాప్స్ అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి సగం ఖర్చుతో వైద్యం చేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ పి.నరసింహారావు, ఆప్తమాలిక్ అసిస్టెంట్ సుజాత, నీలిమ పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన


మసీదుకు శంకుస్థాపనలో పాల్గొన్న ముస్లింలు

పర్చూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో దాతల సహకారంతో నూతనంగా నిర్మించనున్న మసీదుకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం చేశారు. గతంలో ఇక్కడి పాత మసీదు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో నీరు చేరి ప్రార్థనలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో మసీదును తొలగించి నూతన మసీదు నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. రూ.కోటి వ్యయంతో దాతల సహకారంతో మసీదు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లి షేక్ నబీసా, చీరాల మసీదు ముఫ్తీ హబీబుల్లా, నరసరావుపేట మౌలానా సాహిద్, మసీదు ఇమాం, షేక్ అహ్మద్‌బాషా, షేక్ షంషుద్దీన్, బ్యాంక్ కాలేషా, బుల్లా మేస్త్రీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సంపదను సృష్టించడంలో కార్మికుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వెంకటరావు

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సంపదను సృష్టించడంలో కార్మికుల పాత్ర కీలకమని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఏఐటీయూసీ 4వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్మికులు ఏకం కావాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతా యన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, మేడా వెంకటరావు, కోటి దాసు, శ్రీధర్, మాల్యాద్రి, ప్రకాష్, బాబూరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ప్రసాద్, పైడయ్య, బ్రహ్మయ్య, భారతి, కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుకు ప్రాథమిక చికిత్స ముఖ్యం

ఇంకొల్లు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటు వచ్చిన సమయంలో రోగికి ప్రథమ చికిత్సను అందించి ఆసుపత్రికి చేర్చేలా గ్రామీణ వైద్యుల సేవలు అవసరమని ప్రముఖ గుండె వైద్యనిపుణుడు కె.శ్రీధరబాబు సూచించారు. రోటరీ గంగ భవనంలో గురువారం మండల ప్రాథమిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మార్టూరు, పంగులూరు, ఇంకొల్లు మండలాల్లోని ఆర్ఎంపీలు హాజరయ్యారు. మెడీక్యూర్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టరు శ్రీధరబాబు మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన సమయంలో అందించాల్సిన ప్రాథమిక చికిత్స, ఆసుపత్రికి చేర్చేవరకూ తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవళి, డాక్టరు ఉస్మాన్, డాక్టరు రఫీ, శ్రీను, ఇంతియాజ్, శ్రీమన్నారాయణ, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

పెద్దజాగర్లమూడి (పర్చూరు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి చెరువులో గల్లంతైన విషయం తెలిసిందే. యద్దనపూడి మండలం పెద్దజాగర్లమూడి ఎస్సీ కాలనీలోని చెరువులో శనివారం చెరువులో వ్యక్తి పడిన విషయాన్ని తెలుసుకున్న అధికారులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ జాజుల మాల్యాద్రి, చీరాల ఫైర్ రెస్క్యూ టీం సహాయంతో శనివారం అర్ధరాత్రివరకూ, తిరిగి ఆదిఆరం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. అదే కాలనీకి చెందిన బొందు ప్రభాకర్‌రావు(46)గా గ్రామస్థులు గుర్తించారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభాకర్‌రావు భార్య దీనమ్మ అత్యవసర పనిమీద శనివారం ఉదయం బాపట్ల పుట్టింటికి వెళ్లగా, ఇంటర్ చదువుతున్న అతని ఇద్దరు కుమార్తెలు రెబెకా, ప్రవల్లిక పరీక్షలు రాసేందుకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టేందుకు అప్పుడప్పుడూ ప్రభాకర్‌రావు వెళుతుంటాడని ఆ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాల్యాద్రి తెలిపారు.


చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది